# ఎల్లి గన్నేరు

(ఏకాంక నాటకము)

**కృతి**

## విశ్వకవి రవీంద్రుడు

**అనుకృతి**

## శ్రీ మొదలి నాగభూషణ శర్మ

**ఇందులోని పాత్రలు**

| | |
|---|---|
| నందిని | కిశోర్ |
| ఆచార్యుడు | గోసాయి అయ్యవారు |
| రాజప్రతినిధి | సహాయ రాజప్రతినిధి |
| మహారాజు ఫాగులాల్ | చంద్ర |
| గోకుల్ | కొందరు పనివారు |
| గ్రామ నాయకుడు భిక్షు | |

(ఒక రాజప్రాసాదం. దానికి ముందుభాగాన వున్న గవాక్ష రక్షణకు అల్లిబిల్లిగా అల్లిన చిక్కని వల. దానికి ముందు భాగాన......నందిని, కిశోర్ అనే తవ్వు పని కుర్రవాడు)

కిశోర్ : నందినీ...నీ కోసం ఇంకా పూలు తెచ్చాను –

నందిని : త్వరగా వెళ్ళు కిశోర్....నీ పనిలోకి వెళ్లు....మళ్లీ ఆలస్యం అవుతుంది.

కిశోర్ : ఆ త్రవ్వకం పని నిత్యమూ చేసేదే...కొంచెం సేపన్నా ఆ పనిని మాని ఆ కాలంలో నీకు పూలు తీసుకురావాలి.

నందిని : కాని, వాళ్ళకి తెలిస్తే శిక్షిస్తారు కిశోర్.

కిశోర్ : ఎఱ్ఱ గన్నేరు పూలుకావాలని నువ్వు చెప్పావు. ఈ ప్రాంతాల్లో ఎక్కడా ఆ పూలు దొరకకపోవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఎన్నాళ్లనుంచో వెతకగా వెతకగా ఒక గుట్ట మాటున ఒకే ఒక ఎఱ్ఱ గన్నేరు చెట్టు కనిపించింది.

నందిని : ఆ చెట్టు ఎక్కడ వుందో చెప్పు కిశోర్. నేనే వెళ్ళి పూలు తెచ్చుకుంటాను.

కిశోర్ : అంత నిర్దయగా మాట్లాడకు నందినీ. నీ జీవితంలో ఒకే ఒక రహస్యం ఈ ఎఱ్ఱగన్నేరు చెట్టు.

నాకు భిక్షుని చూస్తే ఎప్పుడూ అసూయ. నీ కోసం పాటలు వ్రాసి స్వయంగా పాడుతూ వుంటాడు భిక్షు. యీ రోజు నుంచీ నువ్వీ పూలు నా నుంచి మాత్రమే గ్రహించాలి.

నందిని : కాని ఆ దుర్మార్గులు నిన్ను శిక్షిస్తారంటే నా హృదయం ద్రవించిపోతుంది.

కిశోర్ : ఆ బాధ యీ పూలను నాకు ఇంకా దగ్గరకు తెస్తుంది. అవి నా వ్యధ నుంచి వెలికి వస్తాయి.

నందిని : నిన్ను బాధించే ఏ వస్తువునూ నేను స్వీకరించలేను కిశోర్.

కిశోర్ : నీ కోసం నా ప్రాణాలను సైతం ఇవ్వాలని కలలు కంటున్నాను నందినీ.

నందిని : దీనికి ప్రతిఫలంగా ఏమీ ఇవ్వలేనా కిశోర్.

కిశోర్ : ఒద్దు నందినీ. ప్రతి ఉషోదయాన నేను సమర్పించే యీ పూలకాన్కను తప్పక గ్రహిస్తారని మాట ఇవ్వు.

నందిని : అలాగే కిశోర్. తప్పకుండా తీసుకుంటాను. కాని నీవు మాత్రం జాగ్రత్తగా ఉండాలి సుమా. లేకపోతే నీ యజమానులు శిక్షిస్తారు.

కిశోర్ : వారి శిక్ష నన్ను బాధించదు. వాటిని నేను లెక్కచెయ్యను. ఈ బాధను మరిచిపోతూ నేను నీకు సమర్పించే కానుకయే నాకు విజయం. వస్తాను నందినీ.

(త్వరగా వెళ్ళిపోతాడు. ఆచార్యుడు వస్తాడు)

ఆచార్య : నందినీ.....

నందిని : ఓ ఆచార్యులవారా?

ఆచార్య : నందినీ. ఎందుకిలా మమ్మల్ని మాటిమాటికీ ఆశ్యర్య చకితుల్ని చేసి వెళ్ళిపోతావు? మా హృదయాలు ఉద్బోదన చేసి ఒక్క క్షణం కూడా ఆగకుండా ఎందుకు నిష్క్రమిస్తావు? కొంచెంసేపు తీరికగా మాట్లాడలేవా?

నందిని : నాతో మీకేమవసరం?

ఆచార్య : అవసరమా? దూరాన అటు చూడు...పురుగుల్లా సొరంగాలను త్రవ్వుతూ పోతున్న మనుషులు. ఈ మా యక్షనగరంలో మా భాగ్యమంతా బంగారమే. భూమిలో పాదుకున్న ప్రచ్ఛన్నమైన భాగ్యం. కాని, నీవు మా పరిసరాలను దూరంగా ప్రత్యేకంగా కన్పిస్తావు. నీ భాగ్యం మావలె భౌమ్యమైనది కాదు. శృంఖలాలు ఎరుగని కాంతిరేఖవు నీవు.

నందిని : ఆచార్యుల వారు ప్రతిసారీ నన్నిలా అభివర్ణిస్తూనే వున్నారు. నన్ను చూస్తే మీకెందుకో అంత ఆశ్యర్యం?

ఆచార్య : దట్టమైన అడవులలో చెట్ల ఆకుల మధ్య నుంచి సన్నగా వెలికివచ్చే కాంతిరేఖను చూచి ఎవ్వరూ ఆశ్యర్యపడరు కాని నెరియలు విచ్చిన గోడను ఛేదించుకుంటూ వెలికి వచ్చే కాంతి ప్రకృతి సహజమైన వెలుగు రేఖకు విరుద్ధంగా వుంటుంది. ఈ యక్షనగరానికి నీవు అలాంటి కాంతివి! ఆ! సరేగాని .....మా నగరం నీకెలా వుంది?

నందిని : ఇది విశాలమైన మహానగరం. ఉష్ట్ర పక్షిలా నేలలో తలదూర్చి చీకటిలోకి చేతులు చాచి ఏలంద కూపానికో పయనిస్తున్న మీ నగరాన్ని చూస్తుంటే నాకు ఆశ్యర్యంగా వుంది. భూమికి అట్టడుగున

ఎక్కడికో మీరు సొరంగాలు త్రవ్వుతున్నారు. అక్కడ యుగయుగాలుగా చేతనా రహితమైన జగభాగ్యం కోసమే కదూ మీ ఆరాటమంతా.

ఆచార్య : ఆ భాగ్యాధిదేవతనే మేము కొలుస్తున్నాము. ఆ స్వర్ణలక్ష్మి మా అధీనమైతే సర్వజగత్తునూ పాదాక్రాంతం చేసుకుంటాం. ప్రపంచమంతా మాకు మోకరిల్లుతుంది.

నందిని : అందుకనే! మీరు మాత్రం మీ మహారాజును ఓ ఉక్కువల వెనుక రాజప్రాసాదంలో దాచి వుంచారు. ఆయన కూడా మానవమాత్రుడేనని ప్రజలందరూ గుర్తిస్తారని మీకు భయం కాబోలు!

ఆచార్య : చేతనారహితమైన మా భాగ్యాధిదేవత వలెనే మీ రాచరికం కూడా భయంకరమైనదే. ఆ శక్తిని యీ వల మాటునే దాచివుంచి ప్రజలను భీతావహులను చేయడమే మా సంకల్పం.

నందిని : ఎంత అసంబద్ధంగా మాట్లాడుతున్నారు. సరే, గ్రంథాలదొంతర్లలో, మునకలు వేసే మీరు నాతో వాదిస్తూ కాలాన్ని ఎందుకు వృథా పుచ్చుకుంటారు?

ఆచార్య : ఎవరైనా కాలాన్ని వృథా పుచ్చుతున్నారంటే వారికి కావలసిన దానికన్నా ఎక్కువకాలం అందుబాటులో వున్నదన్నమాట. నిస్తబ్దమైన భూమిలో చిన్న చిన్న పుట్టల్లో పెరిగే కీటకాము మేము. విరామ విహాయ సంలోప్రాగ్దిశాంగనవు నీవు. నిన్ను చూడగానే మా రెక్కలు ఆశాంతితో కొట్టుకుంటాయి. నా గదిలోకిరా నందినీ....నన్ను కూడా కొద్దిసేపు తీరికగా కాలాన్ని వృథాపుచ్చనీ....

నందిని : ఇప్పుడు కాదు. మీ మహారాజును దర్శించడానికి రాజప్రాసాదానికి పోతున్నాను.

ఆచార్య : ఆ ఉక్కువలను తొలగించుకుని నీవు లోనికి పోలేవు.

నందిని : దారిచేసుకుంటాను. అది సరే, యీ ఒక్క విషయం చెప్పండి. నన్ను ఇక్కడకు తెచ్చేటప్పుడు నా రంజన్‌ను ఎందుకు తీసుకురాలేదు ఆచార్యా?

ఆచార్య : పదార్థ విచ్ఛేదన మా వారి నైజం. కాని, నందినీ, అచేతనమైన మా యీ భాగ్యాలమధ్యకు నీ జీవత జ్యోతిని కొనిరావాలని ఆరాటపడుతున్నా వెందుకు?

నందిని : చేతనారహితమైన యీ అస్థిపంజరంలో స్పందించే హృదయాన్ని అతడు ప్రతిష్ఠించగలడు కనుక!

ఆచార్య : ఇక్కడ నువ్వు ఉన్నందుకే మా రాజప్రతినిధులు ఇప్పటికే కలవర పడుతున్నారు. ఇంకా ఆ రంజన్ కూడా వస్తే...

నందిని : వారి జీవితాలు ఎంత హాస్యాస్పదమైనవి. భగవంతుని దివ్యహాసరోచిస్సులను వారి కందించి వారిలో జీవన గీతాన్ని అలపింప చేస్తాడు రంజన్.

ఆచార్య : ఆ దివ్యరస రోచిస్సులు మంచుతెరలను కరిగించగలవే కాని కఠిన పాషాణాలను కరిగించలేవు. మా రాజప్రతినిధులను కండలు తిరిగిన భుజబలం కాని కదిలించలేదు.

నందిని : రంజన్ శక్తి మీ శంఖినీ నది శక్తివంటిది. అది హాస్యోక్తులను పలుకనూ కలదు. అడ్డంకుటను ఛేదించనూ కలదు. ఆ! మీకొక రహస్యం చెప్పనా? ఇవ్వాళ నేను రంజన్‌ను కలుసుకుంటాను.

ఆచార్య : ఆ...రాజప్రతినిధులకు కూడా తెలియకుండా యీ వార్త నీకెలా అందింది?

నందిని : ఆ విషయం చెప్పను కాని. రంజన్ మాత్రం తప్పక వస్తాడు.

ఆచార్య : ఓ...రంజన్ ప్రసక్తి వస్తే చాలు నందని నోటికి తాళం వెయ్యడం కష్టం. ఇక నేను వెళ్ళడం

మంచిది. (కొంతదూరం వెళ్ళి తిరిగివచ్చి) ఆ! ఒక్కమాట. మా యక్షనగరమంటే నీకు భయంవేయడం లేదూ?

నందిని : భయమెందుకు?

ఆచార్య : సర్వజంతుజాలానికి సంపూర్ణ సూర్యబింబ మంటే భయం వుండదు కాని గ్రహణమంటే భయపడతారు. యక్షనగరానికి ఇప్పుడు గ్రహణం పట్టింది. నా మాట విను నందినీ....ఇక్కడ నిలవకు. వెళ్ళిపో. వెళ్ళి త్రాగి ఉన్మత్తులై పుడమితల్లి మేలిముసుగును చింపి వేసే క్రూరులు చొరని తీరాల్లో, రంజన్‌తో సుఖంగా కాలం గడుపు. (కాస్త నిశ్శబ్దం) నందినీ, ఆ ఎఱ్ఱగన్నేరు దండలోంచి ఒక్క పువ్వు నాకిస్తావా?

నందిని : ఎందుకూ?

ఆచార్య : నువ్వు ధరించే ఆ అలంకారల్లో ఏదో శుభసూచన వున్నది. దాని రక్తిమ కేవలం లందగించడమే కాదు, భయభ్రాంతుల్ని కూడా చేస్తున్నది. ఇన్ని రంగులు వుండగా నువ్వు దీనినే ఎందుకు గ్రహించావో? మను తెలియకుండానే మన విధిని నిర్ణయించుకుంటామంటారు పెద్దలు!

నందిని : రంజన్ నన్ను ఎఱ్ఱగన్నేరని పిలిచేవాడు. అతని ప్రేమ యణరాగాన్ని కలిగి వుంటుందని నా కనిపిస్తుంది. అందుకే ఆ రక్తిమను దేహమంతటా ధరిస్తాను.

ఆచార్య : సరే, ఒక్క పువ్వు ఇలా ఇవ్వు. ఆ ఎఱ్ఱదనంలో నిగూఢమైన భావాన్ని నన్నూ అర్థం చేసుకోనీ..

నందిని : ఇదుగో తీసుకోండి. ఇవ్వాళ రంజన్ వస్తున్నాడన్న ఆనందంతో హృదయపూర్వకంగా మీకీ పూవు ఇస్తున్నాను. తీసుకోండి.

(ఆచార్యుడు నిష్క్రమిస్తాడు. గోకుల్ త్రవ్వకపు పనివాడు వస్తాడు)

గోకుల్ : ఎవరమ్మాయి నువ్వు? ఇటు తిరుగు – నీ సంగతేమిటో అర్థం కావడం లేదు.

నందిని : నీకు కనిపిస్తున్న దానికన్నా నాలో ప్రత్యేకత ఏమీ లేదు గోకుల్.

గోకుల్ : నాకు అర్థంకాని విషయాలను నేను నమ్మను. మా మహారాజు నిన్ను ఇక్కడకు ఎందుకు రప్పించాడో?

నందిని : నే నాయనకు ఎందుకూ ఉపయోగించను కనుక......

గోకుల్ : అబద్ధం. నువ్వు ఒట్టి మాయలాడివి. నీ సౌందర్యమనే మోహంలో పడ్డవారికి చావు తప్పదు.

నందిని : (వ్యంగ్యంగా) భయపడకు గోకుల్! నీకు అటువంటి మరణం లభించదు. నువ్వు ఎప్పుడో గనులు త్రవ్వుతూ త్రవ్వుతూనే చచ్చిపోతావు.

గోకుల్ : చూద్దాంలేగాని....నీ మొఖాన ఆ మెరుస్తున్న దేమిటి?

నందిని : ఇది? (చిన్నగా నవ్వి) ఎఱ్ఱగన్నేరు పువ్వు రేకు.

గోకుల్ : అయితే ముఖంమీద అంటించుకున్నావెందకు?

నందిని : ఎందుకేమిటి?....ఊరకనే!

గోకుల్ : నేన్నమ్మను. నువ్వేదో మాయచేస్తున్నావు. నీకు మాయలూ మంత్రాలూ వచ్చు. అందుకే అంత భయంకరంగా వున్నావు. ప్రొద్దుకూకేలోగా మాకేదో ముప్పుతెస్తావు. అందుకే కాదూ నువ్విక్కడికి వచ్చింది?

నందిని : నన్ను చూస్తే అంత భయమెందుకు గోకుల్?

గోకుల్ : నువ్వు కొరివిదయ్యంలా వున్నావు. (అరుస్తూ) బాబోయ్ దెయ్యం, కొరివి దెయ్యం.....(వెళ్ళిపోతాడు)

నందిని : (వలను తడుతూ) రాజభవనంలో ఎవరా వలచాటున? పిలుస్తుంటే పలకరేం?

మగగొంతు: (వల వెనుకనుంచి మహారాజు గొంతు) వినిపిస్తోంది నా పిలుపు. కాని నన్ను పిలవకు. నా కాలం వ్యర్థం చేయకు!

నందిని : నన్ను కూడా లోనికి రానివ్వండి. ఇవ్వాళ నాకెంతో సంతోషంగా ఉంది.

మగగొంతు: అయినా సరే...లోనికి రాకూడదు.

నందిని : మీకోసం కుందకుసుమాల మాల తెచ్చాను.

మగగొంతు: ఆ మాలను నీవే ధరించు.

నందిని : నేను ఎఱ్ఱగన్నేరు మాల వేసుకున్నానుగా!

మగగొంతు: సమున్నత శిఖరాగ్రం వంటివాణ్ణి నేను...నగ్నత్వమే నాకలంకరణ.

నందిని : శిఖరాగ్రాలనుంచి పరుగులెత్తే సెలయేరులా మీ వక్షస్థలిపై మాలను నాట్యం చేయనివ్వండి. యీ ఇనప వలను ఛేదించండి. నేనూ లోనికి వస్తాను.

మగగొంతు: అలా చేయనీను....అందుకు వ్యవధి లేదు.

నందిని : దూరంగా ఆ పాట వినరావడం లేదా మీకు?

మగగొంతు: ఏమిటా పాట?

నందిని : శిశిర గీతం.

(శిశిర గీతం....అనుబంధంలో ఒకటవ పాట)

నందిని : ఈ పంటపొలాలలోకి మీకు కూడా రండి మహారాజా!

మగగొంతు: నేనెందుకు?

నందిని : ఆక్కడి పని మీ యక్షనగరంలో పనికంటే ఎంతో సులభమైంది.

మగగొంతు: అంత సులభమైన పనులు చేయడం నాకు సాధ్యం కాదు. పరవళ్ళు తొక్కుతూ జలజలా పరుగెత్తే సెలయేరులా సరోవరం నృత్యం చేయగలదా? నన్ను వదిలి వెళ్ళు. నా కాలం వ్యర్థం చేయకు.

నందిని : మీ రాజ భవనంలోకి నేను వచ్చినప్పుడు అక్కడి బంగారపు టచ్చులు చూసి నేను ఆశ్యర్యపడలేదా? ఏ శక్తితో మీరు ఆ అచ్చులను అంత సక్రమంగా పేర్చగలిగారో, ఆ శక్తికి ఆశ్యర్యపోయాను. చైతన్యహీనమైన యీ నిధి నిక్షేపాలను కూర్చి పేర్చడానికి మీకు భయం కలగడం లేదా మహారాజా?

మగగొంతు: భయం? ఎందుకు?

నందిని : ప్రేమభావానికి జీవనరాగానికి సౌందర్యానుభూతికి తన హృదయాన్ని సైతం అర్పించేగలదు యీ పడమితల్లి. కాని దాని తల్లి గుండె పెళ్ళగించి నిర్జీవమైన వానిని వెలికితీయడానికి ప్రయత్నిస్తే – ఆ వెలికి వచ్చిన వానితో పాటు క్రూరుడైన చీకటి రాక్షసుని భయంకరమైన అభిశాపం

మిమ్ము వెంటాడుతుంది. ఇక్కడి ప్రతిజీవినీ కోపమో, భయమో, అనుమానమో ఆవహించి వుండడం మీరు చూడడం లేదా మహారాజా?

మగగొంతు: అభిశాపమా?

నందిని : ఔను...దోపిడీకి, హత్యలకూ పర్యవసానం.

మగగొంతు: కాని నందినీ....మేము ఇక్కడ శక్తిని ఉద్దీపింపచేస్తాం. నా శక్తి నీకు ఆనందాన్ని కలిగించడం లేదా నందినీ.

నందిని : కలిగిస్తోంది మహారాజా......అందుకే వెలుగులోకి రండి..మీ శక్తితో సర్వజగత్తునూ ఆనందపరచండి.

మగగొంతు: సౌందర్యమర్మాకృతివి, నీకు కూడా విస్పష్టంకాని ఏ ఆకృతి వెనుకనో ప్రచ్ఛన్నంగా దాగి వున్నావు. నిన్ను వెలికిదార్చి నా చేతులతో బంధించి, ఆజ్ఞాపించి సంస్కరించాలని – లేకుంటే తుత్తునియలుగా ఛేదించాలని నా ఆకాంక్ష...

నందిని : ఏమిటి మీరనేది? నా కర్థంకావడంలేదు.

మగగొంతు: నీ ఎఱ్ఱగన్నేరు రక్తిమను వెలికితీసి దానిని నా కళ్ళముందు నిత్యమూ కనిపించే కలలా ఎందుకు నిర్మించుకోలేను? క్షుద్రమైన ఆ పూలరేకులు నన్ను అడ్డగిస్తున్నాయి. నీలో కూడా అలాంటి ఆటంకమే కనిపిస్తున్నది. సుమసుకుమారమూ, వజ్రకఠోరమలాలయిన నీలోని ఏదో శక్తి నన్ను ఆటంకపరుస్తోంది. నందినీ, నన్ను గురించి నీ అభిప్రాయం చెప్పవూ?

నందిని : ఇప్పుడు కాదు. మీకు తీరిక లేదు. నన్ను వెళ్ళనివ్వండి.

మగగొంతు: వీల్లేదు....చెప్పిపోవాల్సిందే!

నందిని : ఎన్నిసార్లు చెప్పను? హోరుగాలికి దొరలిపోయే కారుమబ్బుల దొంతరలవంటి మీ భుజబలం చూచినప్పుడల్లా నా హృదయం లోలోన నర్తిస్తుంది.

మగగొంతు: మరి రంజన్‌ని చూచినప్పుడు కూడా నీకిలాగే అనిపిస్తుందా?

నందిని : ఇప్పుడా సంగతి ఎందుకులెండి. మీకు తీరికలేదు!

మగగొంతు: వుంది.....యీ ఒక్క విషయం మాత్రం చెప్పివెళ్ళు.

నందిని : మీకు వివరించి చెప్పలేను. నన్ను వెళ్ళనివ్వండి.

మగగొంతు: నందనీ, నేనంటే నీకు ఇష్టమే కదూ. కనీసం ఆ మాటైనా చెప్పివెళ్ళు.

నందిని : ఔను....ఇష్టమే.

మగగొంతు: రంజనుకు మల్లేనా?

నందిని : మళ్ళీ అదే మాటా...యీ విషయాలేవీ మీకు అర్థంకావని చెప్పలేదూ?

మగగొంతు: ఎంతో కొంత నాకూ అర్థమయింది. నాకూ రంజనుకు వున్న తేడా ఏమిటో తెలుసా? నాలో భుజశక్తి వుంది....రంజనులో మాయా తంత్రమూ ఉన్నాయి!

నందని : మాయా? అంటే?

మగగొంతు: చెప్పనా? పాతాళంలో రాళ్ళూ ఇనుమూ బంగారమూ అచ్చులుగా వున్నై. అది శక్తికి ప్రతిబింబం.

ధరాతలం మీద పచ్చని పనిరిక వుంది. వికసించే పూలున్నై. అక్కడ గారడీ ఆటవుంది. అట్టడుగున అజ్ఞాతంగా వున్న ఆ నిధులను వెలికి తీయగలను కాని అతి సమీపంలో వున్న యీ మాయను హస్తగతం చేసుకోవడం నా చేతకావడం లేదు.

నందిని : ఎన్నిసార్లో యీ విషయాలు చర్చించుకున్నాం. ఇంకా యీ ఆకాంక్ష ఎందుకు?

మగగొంతు: భారమూ, అచేతనమూ అయిన యీ సంపదను మాత్రమే నేను పొందగలిగాను. ఎంత బంగారం వున్నా ఒక్క గీటురాయిని రూపొందించలేను. ఎంత అధికారం వున్నా యౌవనంతో సరితూగలేదు. రంజనులాగే నేనూ యువకుడినయితే నిన్ను స్వేచ్ఛగా వదిలికూడా ధృఢంగా నా అదుపులో పట్టి వుంచగలను. కాని...కాని....బంధించడానికి కావలసిన బంధనాల్ని అల్లుకోవడంలోనే నా కాలం గడిచిపోతుంది. ప్రపంచంలో ఒక్క సంతోషాన్ని తప్ప ప్రతిదానిని బంధించవచ్చు.

నందిని : ఈ ఇనపవలలో మిమ్మల్ని మీరే బంధించుకున్నారు...ఇంకా ఎందుకిలా వ్యధచెందడం?

మగగొంతు: నీ కేనాటికి అర్థంకాదు నందినీ. నేనో ఎడారిలాంటి వాడిని. పచ్చిబయలు వంటి నీవైపుకు చేతులు చాచి నా మనస్సు శీర్ణమై జీర్ణమై వ్యధ చెందుతోందని బాధపడుతున్నాను. క్షుద్బాధతో నెత్తురులుమిసే యీ ఎడారి ఖండఖండాలుగా యీ భూమిని కబళిస్తూందేగాని పసరు పచ్చిక పరక నొక్కదాన్ని కూడా కదలించలేకపోతుంది.

నందిని : మీరింతగా అలసిపోయారా మహారాజా...

మగగొంతు: నందినీ.....ఒకప్పుడు ఒక పర్వతాన్ని చూచాను. ఆ కొండలోని ప్రతి బండరాయీ అంతరాంతాల్లో దుర్భరమైన వ్యధ చెందుతున్నదని నేను గ్రహించలేకపోయాను. ఒకనాటి నడిరేయి, భయంకరమైన ఏదో ధ్వని వినిపించింది. తెల్లారి చూచేసరికి భూకంపంవల్ల బ్రద్దలై ఆ పర్వతం అదృశ్యమైపోయింది. అంత భారమైన శక్తి చివరకు తన భారంవల్ల తానే ఎలా క్రుంగిపోయిందో నా కానాడు తెలిసివచ్చింది. నీలోనో? అందుకు విరుద్ధమైన లక్షణం కన్పిస్తున్నది.

నందిని : ఏమిటది?

మగగొంతు: సర్వ ప్రకృతి చేసే నృత్య విన్యాసం....

నందిని : అంటే?....

మగగొంతు: వస్తువు యొక్క అసల్పమైన భారాన్ని దూదిపింజకన్న తేలిక చేయగలదా విన్యాసం. ఆ విన్యాసానికి నక్షత్రాలు, గ్రహాలు ఒక మేఘశకలం మీది నుంచి మరొకదానిమీదికి నృత్యం చేస్తూ పయనిస్తాయి. ఆ నృత్యవిన్యాసమే నిన్ను ఇంత అమాయికంగాను, ఇంత పరిపూర్ణంగాను రూపొందించింది. నాతో పోల్చి చూస్తే నువ్వు ఎంత అల్పమైనదానివి. అయినా నిన్ను చూచి అసూయపడుతున్నాను నేను.

నందిని : మీరలా ఎప్పుడు మాట్లాడినా నాకు అయోమయంగా వుంటుంది. ఇక నేను వెడతాను.

మగగొంతు: వెళ్ళు....కాని ఇటుచూడు...యీ కిటికీలోనుంచి నా చేతని చాస్తున్నాను. దీనిమీద అరక్షణం నీ చేతిని కూడా వుంచు.

నందిని : మిగిలిన శరీరాన్నంతా అజ్ఞాతంగా వుంచి, ఒక్క చేతిని మాత్రమే చూపుతున్నారు? ఒద్దు..నాకు భయంవేస్తున్నది.

మగగొంతు: నా చేతిని మాత్రమే చూచి ప్రతివారూ నాకు దూరంగా పారిపోతున్నారు. కాని నా సర్వాంగాలతోను నిన్ను ఆపివుంచాలని వాంఛించినప్పుడు నా వద్దకు రాగలవా నందినీ?

నందిని : నన్ను లోనికి రానివ్వకుండా బయట నిలబెట్టి ఎప్పుడో జరగబోయేదానిని గురించి ఇలా మాట్లాడి ప్రయోజనం?

మగగొంతు: ప్రతిక్షణమూ ఆటంకాలతో క్షణం విశ్రాంతి లేని యీ కాలం నీవు రాతగినది కాదు. నాకు విశ్రాంతి లభించి నువ్వు రాదగిన సమయమాసన్నమైనప్పుడు మలయమారుతం తేలివచ్చి స్వాగత ఘంటికలు వినిపిస్తాయి......అప్పుడు నువ్వు రావచ్చును. కాని ఆ రోజు ఇంకా రాలేదు.

నందిని : ఆ మలయమారుతాన్ని తనతో తెస్తాడు రంజన్. నిర్విరామకార్యనిమగ్నతలో సైతం విశ్రాంతిని వెంటపెట్టుకుని వస్తాడు రంజన్.

మగగొంతు: (త్వరగా) సరే, ఇక వెళ్ళిరా...ఇంక ఇక్కడే వుంటే ప్రమాదం.

నందిని : వెడుతున్నాను. కాని ఒక్క విషయం. ఇవ్వాళ రంజన్ వస్తున్నాడు. అతని రాకను మీరు అడ్డగించలేరు. తెలుసా?

(నందిని వెళుతుంది. ఫాగులాల్ అనే త్రవ్వుపనివాడు అతని భార్య చంద్ర వస్తాడు)

చంద్ర : యీ రోజుల్లో మన వూళ్ళో వుంటే ఎంత బావుంటుంది?

ఫాగు : అవును. ఆ పల్లెల్లో పండుగరోజుల్లో మన ఇష్టానుసారం వుంటే ఎంత హాయిగా వుండేది. కాని – ఇక్కడ? పంజరంలోని పక్షి తనకు విశ్రాంతి దొరికనప్పుడల్లా పంజరపు కటకటాలకు తన రెక్కలను కొట్టుకుంటూ కాలం గడుపుతుంది. యీ యక్షనగరంలో పనిచేసే రోజులకంటే విశ్రాంతి దినాలు అధ్వాన్నంగా ఉంటాయి.

చంద్ర : అయితే మన వూరు వెళ్ళిపోదాం....పదండి.

ఫాగు : ఆ దారి ఇక ఎప్పటికి మూసివేయబడ్డది.

చంద్ర : ఏం?

ఫాగు : మనం పల్లెటూళ్ళలో వుంటే మహారాజులకు ఏమీ లాభం ఉండదు.

చంద్ర : మనం సర్వనాశనమైపోతున్నా వారికి లాభాలు తేవడానికి మాత్రం బ్రతకాలన్నమాట.

ఫాగు : మన పిచ్చి భిక్షుత చెబుతూ వుండేవాడులే....అదుగో, తనలో తానే ఏదో పాడుకుంటూ అటుపోతున్నాడు భిక్షు.

చంద్ర : యీ మధ్య పాటలు ఎక్కువయ్యాయి భిక్షుకి...ఇదంతా ఆ నందిని ప్రభావమే.

ఫాగు : ఔనవును. అందులో ఆశ్చర్యమేముంది.

చంద్ర : ఆ అయితే మీరు కూడా జాగ్రత్తగా వుండడం మంచిది. కొన్నాళ్ళకు మీచేతకూడా కూనిరాగాలు తీయించగలదు ఆవిడ...పాపం మీరు పాట మొదలుపెడితే ఇరుగుపొరుగు వారికి ఎంత బాధో.

ఆ మంత్రకత్తెకు ఎన్ని జిత్తులయినా తెలుసు.

ఫాగు : భిక్షూకు నందిని ఇక్కడకు రాక పూర్వం నుంచి తెలుసు.

చంద్ర : (పిలుస్తూ) భిక్షూ....ఇక్కడ కూడా నీ పాటలు వినదగ్గవాళ్ళున్నారు.

(భిక్షు పాడుకుంటూ వస్తాడు.....నావికుడా పాట అనుబంధం 2)

చంద్ర : నీకు కలలో కనిపించిన ఆ నావికుడు ఎవరో నాకు తెలుసు.

భిక్షు : నా పడవలోకి నువ్వు రాలేదే...నీకెలా తెలుసు?

చంద్ర : భిక్షూ ఒక్క మాట చెబుతాను జ్ఞాపకం ఉంచుకో. నీకంత ఇష్టంగా వున్న ఆ నందినే ఎప్పుడో నీ పడవలను ముంచేస్తుంది.

గోకుల్ : (ప్రవేశించి) భిక్షూ....నీ నందిని అంటే నాకు ఏ మాత్రం నమ్మకం లేదు.

భిక్షు : ఎందుకని? నీకేమపకారం చేసింది గోకుల్?

గోకుల్ : ఆమె ఏమీ చెయ్యలేదు. అదే ఇబ్బంది. ఆవిడ తీరేనాకు నచ్చలేదు.

చంద్ర : ఆవిడ తన అందాన్ని అలా నలుగురికీ చాటుకుంటూ పోవడం చూస్తే నాకు కంపరం ఎత్తుకొస్తుంది.

భిక్షు : ఇక్కడివాళ్ళు అందాన్ని సహించలేరని నాకు తెలుసు. బహుశః నరకంలో కూడా అందం ఉంది ఉంటుంది. అక్కడి వారి కెవ్వరికీ అది అర్థం కాకపోవడమే వారికి అన్నింటికన్న పెద్ద శిక్ష.

చంద్ర : మేమందరం అందం మొహం ఎరగనివాళ్లం – సరే – మన రాజప్రతినిధి మాటేమంటావు – ఆయనక్కూడా నందినంటే పడదు....తెలుసా?

భిక్షు : జాగ్రత్త చంద్రా....అదే జబ్బు నీకూ సోకవచ్చు. అప్పుడు మమ్మల్ని చూచి అసహ్యించుకొని దూరంగా పోగలవు. ఏమంటావు ఫాగులాల్?

ఫాగు : నిజం చెప్పనా తమ్ముడూ....నందినినిన చూచినప్పుడల్లా నన్ను చూచి నేను సిగ్గుపడుతుంటాను ఆమె నా ఎదుట వుంటే ఒక్క మాట వెగిలిరాదు.

గోకుల్ : ఎప్పుడో ఒకప్పుడు ఆవిడ సంగతి నీకూ తెలిసిరాకపోతుందిట్టే – (నిష్క్రమిస్తాడు)

చంద్ర : ఏమైనా యీ యక్షనగరానికి వచ్చాక మీ మగవాళ్ళందరికీ మతులు పోయాయి...మే మాడవాళ్ళం మాత్రం ఏమీ మారలేదు.

భిక్షు : ఎందుకు మారలేదు. ఇప్పుడు మీరంతా బంగారం కోసం తపించిపోతున్నారుగా.....

చంద్ర : అబద్ధం....

భిక్షు : ముమ్మాటికి నిజం....రోజూ పన్నెండు గంటలకు మించికూడా ఫాగూలాల్ ఎందుకు పనిచేస్తున్నాడు. అతనికి తెలుసు. నీకూ తెలియకపోవచ్చు. నాకు మాత్రం తెలుసు బంగారం కోసం నువ్వు కనే కలలు మేస్త్రీ దెబ్బలకన్నా ఎక్కువ బలవంతం చేసి బాధ పెట్టి అతనిచేత అంత పనికిమాలిని పని చేయిస్తున్నాయి.

చంద్ర : అయితే ఇక్కడ వుండనే ఒద్దు....మన వూరు పోదాం....

భిక్షు : మనం పోవలసిన త్రోవను – పోవాలనే ఆశనూ బంధించివేశాడు మీ రాజప్రతినిధి. ఒకవేళ

నువ్వు మనవూరు వెళ్ళినా పంజరంలో చిలుకను బయటకు వదిలినా మందు కలిపిన పండును

ఫాగు : భిక్షూ...మొన్నటిదాకా పెద్ద పెద్ద పుస్తకాలు కళ్ళు పోయేలా చదువుతూవుండేవాడివి. చదువురాని మొద్దులం...మాతో పాటు ఇక్కడ పనిచెయ్యడానికి వీళ్లు నిన్నిక్కడకు ఎందుకు తీసుకొచ్చారో?

చంద్ర : భిక్షూ యీ ప్రశ్నకుమాత్రం సమాధానం చెప్పడు.

ఫాగు : చెప్పకపోతే మాత్రం మనకు తెలియదా?

భిక్షు : తెలిస్తే అదేమిటో నువ్వే చెప్పు.

ఫాగు : మా అందరి మీదా గూడాచారిగా వుండమన్నారు నిన్ను.

భిక్షు : ఆ సంగతి తెలిసినవాళ్ళు నన్ను ప్రాణాలతో ఎలా వదిలారు ఫాగులాల్?

ఫాగు : నీలాంటి వాడు ఎలాంటి ఉద్యోగం చేయలేదని కూడా మాకు తెలుసు.

చంద్ర : అంత మంచి నౌకరీ ఎందుకొదులుకున్నావు భిక్షూ...

భిక్షు : మంచి ఉద్యోగమా? వీపుమీది రాచపుండులా ఒక మనిషిని ఇరవై నాలుగ్గంటలూ అదిమి పెట్టుకు వుండడం మంచి ఉద్యోగమా?...నా ఆరోగ్యం బాగుండడం లేదు నే నింటికి పోతానని చెప్పాను. అయ్యయ్యో, అలాగా పాపం, యీ పరిస్థితుల్లో ఎలా వెళ్ళగలవు? అయినా ప్రయత్నించి చూడు అన్నాడు రాజప్రతినిధి. నేను ప్రయత్నించి చూచాను. యీ యక్షనగరపు కబంధ హస్తాలతో ఒక్కసారి చిక్కుకున్న తర్వాత ఒక బయటకు వెళ్ళే ఆస్కారం లేదు. ఎంతసేపూ లోలోపలే గిరికీలు కొట్టాలి. ఆశా వెలుతురూ లేని యీ అంధకారంలో నేను బంధించబడ్డాను. మీకూ నాకూ భేదమేమిటో తెలుసా? రాజప్రతినిధి మీకంటే నన్నే హీనంగా చూస్తాడు.

ఫాగు : అయితే ఏం భిక్షూ....మాకు నీ మీద వున్న గౌరవం ఎంతో పెరిగింది.

భిక్షు : మీరు ఎక్కడ అభిమానం చూపుతారో అక్కడల్లా రాజప్రతినిధి చూపులు నర్తిస్తాయి.

చంద్ర : ఇక్కడిపని ఎంతకాలంలో పూర్తవుతుంది భిక్షూ.....

భిక్షూ : వీరి జాతకాల్లో ఆఖరు రోజంటూ లేదు. మొదటి రోజు తరువాత రెండోరోజు, అటు తరువాత మూడోది. అంతే – మనం ప్రతినిత్యమూ త్రవ్వుకఉ పోతున్నాం. అడుగు, రెండడుగులు, మూడడగులు...ఒకదాని తరువాత ఒకటి బంగారపుటచ్చుల్ని తీసి పేరుస్తున్నాం. యీ యక్షనగరంలో అన్నీ అంకెలే – అంతం అంటూ లేని అంకెలు...అందుకే ఇక్కడి మనుషులు మనుషులు కాదు. కేవలం అంకెలు..ఏం ఫాగూ నీ అంకె ఎంత?

ఫాగు : నా అంకె 47 క...

భిక్షు : నేను 99 చ – ని.....

చంద్ర : ఇన్ని బంగారపుటచ్చులు త్రవ్వారు కదా, ఒక యీ త్రవ్వకం ఆపకూడదా?

భిక్షు : ఆపితే ఎలా? అవసరమైన వస్తువులకే అంతం అంటూ ఒకటి వుంటుంది. ఇంకా సంపాదించాలనే పిచ్చి ఎత్తకూడదు. యీ బంగారపుటచ్చులు మన మహారాజులకు అటువంలి పిచ్చెత్తించే మత్తుమందు. ఆ మత్తుమందు తినే సరికి మనమూ మానవమాత్రులమే ననీ, మనమూ కొన్ని పరిధులు దాటిపోలేమని – యీ విషయాలను మరిచిపోదాం....ఆ బంగారాన్ని చూచిన మత్తులో

యీ భౌతికమైన సర్వస్వాన్ని వదిలి ఎక్కడికో అందరాని ఎత్తులకు ఎగిరిపోయి అక్కడే విహరిస్తున్నాడు మన మహారాజు.

చంద్రం : (ఆశగా) ఈ రోజుల్లో మనవూళ్ళల్లో కుప్పనూర్పులు జరుగుతుంటాయి. మనం మన వూరు పోదామంటే.

ఫాగు : నీకు లక్షసార్లు చెప్పాను. యీ నగరంలో వ్యాపారవీధికీ, శ్మశానవాటికకు, వురికంబానికి ప్రతిచోటికి రాజవీధులున్నాయి....ఒక్క స్వగ్రామానికి తప్ప.

చంద్ర : ఒక్కసారి మనం రాజప్రతినిధిని కలుసుకుని చెప్పలేమా?

భిక్షు : రాజప్రతినిధి గొప్పతనం మీ ఆవిడకు తెలిసినట్లు లేదు ఫాగులాల్.....

చంద్ర : ఏం? అంత మంచివాడిలా కనిపిస్తాడు మరి.

భిక్షు : అవును...మంచివాడు...నాగరకుడు...ఒక్కసారి మొసలిపట్టు పట్టాడంటే ఆ పట్టు విడిపించడానికి మహారాజుగారి తరంకూడా కాదు.

చంద్ర : అరుగో....వారే వస్తున్నారు.

భిక్షు : ఇక మన పని అయినట్లే. మన ప్రతి మాటా ఆయన వినే వుంటాడు.

చంద్ర : మనం తప్పుమాట ఏం అన్నాం?

భిక్షూ : చంద్రా మాటలు అనడమే మనవంతు....అర్థాలు వాటంతట అవే పుడతాయి. అదుగో వస్తున్నారు రాజప్రతినిధులు.

చంద్ర : దండాలు బాబూ....దండాలు.

రా.ప్రతి : ఏం కావాలమ్మా?

చంద్ర : కొన్నాళ్ళపాటు మా ఇళ్ళకు వెళ్ళి వస్తాం బాబూ........

రా.ప్రతి : ఏం? మేమిచ్చిన ప్రాసాదాలు పల్లెల్లో వీ ఇళ్ళకంటే సౌకర్యంగా లేవా? మా భద్రత కోసమని ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక కాపలావాణ్ణి కూడా నియమించిందే...ఓ, 99, యీ మనుషుల మధ్య నిన్ను చూడడం గ్రద్దవచ్చి పరిగె పిట్టలకు కంకులు దుయ్యడం నేర్పినట్లుగా వుంది.

భిక్షు : అయ్యా, మీ పరిహాసం బాగానే వుంది కాని నా పాదాలకు ఇతరులచేత కూడా నాట్యం చేయించే శక్తి వుంటే నేను ఎప్పుడో ఇక్కడి నుండి పారిపోయివుండేవాడ్ని. కనీసం ఇక్కడి నాట్యాచార్యుల పాట్లు చూసి అయినా యీ పరిస్థితులను బట్టి నిఖారుగా నడవడానికి కూడా ప్రజలు వణకిపోతున్నారు.

చంద్ర : మాకు నెలవిప్పించండి బాబూ....ఒక్కసారి మా ఇళ్ళకు వెళ్ళి హాయిగా తలలూపే వరికంకుల్ని, మా మఱ్ఱి చెట్ల నీడల్ని చూచిరానివ్వండి. అక్కడికి వెళ్ళాలని ఎంత తపించిపోతున్నాం. అంధకారంలో నిత్యమూ కష్టించే యీ మనుషులంటే నైనా మీకు దయలేదా?

రా.ప్ర : వాళ్ళను గురించి మాకు ఆదుర్దుగానే వుందమ్మా.....సరిగ్గా అందుకే పెద్దయ్యవారు గోసాయిగారిని ప్రతి సాయంకాలమూ ఇక్కడకు వచ్చి వీరికి నీతిబోధ చేయవలసిందిగా కోరాము.

ఫాగు : అలా కుదరదు బాబు, ఇప్పుడైతే కనీసం ప్రతి సాయంకాలం మత్తులో నైనా పడివుంటున్నాం.

అదీ లేక ప్రతిరాత్రీ యీ నీతిబోధ మొదలు పెడితే ఇక్కడ హత్యాకాండ జరుగుతుంది.

భిక్షు : ఉష్......వూరుకో ఫాగూలాల్.

రా.ప్రతి : అయ్యవారిని తలుచుకున్నంతనే దర్శనమౌతుంది. మాటలోనే వచ్చారు. ప్రణామములు స్వామీ. ఈ మనుష్యుల పేద మనసులు అప్పుడప్పుడూ చలిస్తూ వ్యధ చెందుతున్నై. వారి కర్ణపుటాల్లో శాంతి వచనాలు భగవద్భక్తి నూరిపోయండి. చాలా అవసరం.

గోసాయి : యీ మనుషులందరూ మునిగిపోతున్న భూమిని మూపునదాల్చిన కూర్మావతారానికి ప్రతిబింబాలు కాదూ? తమపై నున్న భారాన్ని శాంతంగా భరించగలుగుతున్నారు కనుకనే యీ భూమి యిలా నిలిచింది. యీ మాట అనుకున్నప్పుడల్లా నా శరీరం హర్షపులకితమవుతూ వుంటుంది. నాయన లారా, ముక్తకంఠంతో నారాయణ స్మరణ చేయండి. మీ బాధలన్నీ తొలిగిపోతై. మానవసేవయే మాధవసేవ అన్నారు మహర్షులు. నిరంతర పురుషోత్తమ నామ సంకీర్తన చేసే మా నోళ్లకు పట్టెడు మీ బాధ్యత అందులోనే శాంతి వుంది. రామకోటి ముద్రాంకితమైన యీ పవిత్ర దేహానికి చెమటోడ్చి జానెడు గుడ్డ సేని పెట్టడం మీ బాధ్యత. అందులోనే ఆనందముంది. ఏ పూనికలోనైనా ఆది మధ్యాంతాల్లో హరినామస్మరణ చేసినవానికే అంతిమ విజయమని పురాణాలు ఘుషిస్తున్నై.

చంద్ర : ఎంతబాగా సెలవిచ్చారు అయ్యవారు. ఇంత మంచిమాట విని ఎన్నాళ్లయిందో? మీ పాదధూళి కొంచెం అనుగ్రహించి నన్ను తరింపచెయ్యండి స్వామీ.....

ఫాగు : అనవసరంగా వీళ్ళకోసం ఖర్చుచెయ్యకండి ప్రభూ...వారి దీవనెలు మాకు కావలసిందే. కాని చేసే యీ నీతిబోధ మాన్పించండి.

భిక్షు : నీలాంటివాళ్ళు ఏమాట అనుకుంటే అంతే ఫాగూలాల్. కొంచెం తగ్గివుండు.

చంద్ర : ఏమిటండీ మీ మాటలు? ఇహపరాలు రెండూ చెడగొట్టుకుంటారా? ఇదివరకు ఇలా లేరు, నందిని ప్రభావం మీ తలకు కూడా ఎక్కినట్లుగావుందే.

గోసాయి : వీరు మనసులో అనుకున్నవన్నీ పెదవులుదాటి వచ్చిపడుతున్నయ్యి. వీరికి మన మింకేం నీతిబోధ చేస్తాం. వీళ్ళే నీతిపాఠాలు చెప్పాలి. రాజప్రతినిధులు నా ఉద్దేశ్యం గ్రహించే వుంటారు.

రా.ప్రతి : యీ ప్రమాదమంతా ఎక్కడినుండి దాపురించిందో నాకు తెలుసు. నేనే పరిస్థితుల్ని స్వయంగా చక్కబరుస్తారు. యీలోగా దయచేసి ప్రక్కపేటకు వెళ్ళి అక్కడివారికి హరినామం వినిపించండి. అక్కడి ప్రజలందరూ ఎంతోకొంత అసంతృప్తిగా వుంటున్నారని వార్తలు అందాయి.

గోసాయి : ఆ పేటలోవాళ్ళు ఇంకా ఇదివరకలా స్తబ్దులుగానే వున్నారు. అక్కడింకా కొన్నాళ్ళపాటు రక్షకదళాలను వుంచడం మంచిది. గర్వం మన గర్భశత్రువని పురాణాలు ఘోషిస్తున్నాయి. రక్షకభటులు ప్రజల్లో ఆ గర్వాన్ని తగ్గిస్తే తరువాత మనవంతు వస్తుంది. మరి వస్తానాయనా.

చంద్ర : మమ్మల్ని క్షమించండి అయ్యవారూ...మేమందరం సరైన త్రోవలో నడవాలని దీవించి వెళ్ళండి.

గోసాయి : భయపడకమ్మా.....చివరకు అందరూ సవ్యంగానే నడుస్తారు....(వెళ్ళిపోతాడు)

రా.ప్రతి : ఏయ్ 99, నీ పేటలోని ప్రజల్లో అసహనం ఎలా రేకెత్తుతుందో చూశావా?

భిక్షు : ఆశ్యర్యం ఏముంది ప్రభూ...వీరంతా కూర్మావతారానికి ప్రతిబింబించాలని అయ్యంవారు సెలవిచ్చారు గదా...అప్పుడప్పుడూ అవతారాలు మారుతూ వుంటాయిని పురాణాలు ఘోషిస్తున్నాయి. ఆ కూర్మం, వరాహం అయితే దానికి గట్టిమూపుకు బదులు పదునైన కోరలు వచ్చి పూర్వం వున్న క్షమకు బదులు అహంకారం కాఠిన్యం తలెత్తడంతో ఆశ్యర్యంలేదు.

చంద్ర : నా మనవి మాత్రం మరిచిపోకండి ప్రభూ....

రా.ప్రతి : విన్నానుగా.......జ్ఞాపకం వుంచుకుంటాను.....(వెళ్ళిపోతాడు)

చంద్ర : ఆయన ఎంతమంచివాడో చూశారా....ఎంత చక్కగా నవ్వుతాడో..

భిక్షు : మొసలినవ్వు....నవ్వుతూనే కరుస్తుంది.

చంద్ర : ఇప్పుడెవర్ని కరిచింది?

భిక్షు : పనివాళ్ళతో పాటు వారి భార్య లెవరూ త్రవ్వకం జరిగే చోటికి రాకూడదని వారి కొత్త నియమం.

చంద్ర : ఏం? వాళ్ళని మాత్రం అడిగేవాళ్ళు లేరూ?

భిక్షు : వారికేం? వారి భర్తల కన్న ఎక్కువగా బంగారపు మత్తులో ప్రపంచాన్నే మైమరిపించిందంటారు.

చంద్ర : అదుగో చూడు భిక్షు...అటు దూరంగా ఎంత పెద్ద ఊరేగింపో? ఒకదాని తర్వాత ఒకటి వరసగా ఎన్ని పల్లకిలో? రత్నాలు పొదవిన అంబారీలతో ఏనుగులు, సూర్యకాంతిని ఈటెల చివళ్ళ కొంచెంగా పూతపూసినట్లు మెరిసే బల్లేలు. చూడుచూడు...

భిక్షు : రాజప్రతినిధి, సహాయ ప్రతినిధి, వారి కుటుంబాలు పతాక పూజకు వెళ్తున్నారు.

చంద్ర : ఎన్ని నగలో....ఎన్ని ఆభరణాలు ఎన్ని అలంకారాలు..ఎంతందంగా వున్నారో....భిక్షూ నువ్వు నీ ఉద్యోగం వదిలిపెట్టి వుండకపోతే....ఆ మహోత్సవంలో నువ్వూ సతీ సమేతంగా పాల్గొని రాచమర్యాదలు అనుభవించి ఉండేవాడివి కదూ.....భిక్షూ.

నందిని : (దూరంగా) భిక్షూ!

ఫాగు : అదుగో ఎఱ్ఱగన్నేరు దేవత నందిని వస్తోంది. ఇంకెక్కడ భిక్షూ. పోదాం పద చంద్రా.

చంద్ర : ఇదుగో భిక్షూ...నువ్వు నందినికి లేనిపోని గొప్పలు ఆపాదించి నెత్తినెక్కించుకుంటున్నావు. చివరికా అమ్మవారు నిన్ను నరకకూపంలోకి తోసిపారేస్తుంది. జాగ్రత్త...మేం పోతున్నాం.

నందిని : భిక్షూ....ఇవాళ ఉదయం నేను మహారాజును చూశాను.

భిక్షు : నందినీ అందరి బ్రతుకులు నీకుమల్లే హాయిగా తెల్లవారవు. గత రాత్రంతా నేను చాలా కష్టం మీద గడిపాను తెల్లవారినా రాత్రి కురిసిన చీకటి మచ్చలు ఇంకా మాయం కాలేదు.

నందిని : ఆ పాటలు వింటుటేనా హృదయం పులకరించిపోయింది. ఆ ఆనందంలో నేను కూడా వారితో కలిసి ఆ ప్రహరీ గోడమీద నిలబడి పాటలు పాడాలని ఎంతో ఉవ్విళ్ళూరిపోయాను. కాని ఆ కాపలా వాళ్ళు నన్ను అడ్డగించారు. అందుకే నీ దగ్గరకొచ్చాను.

భిక్షు : నేను ఆ ప్రహరీగోడను కాదుకదా మరి...

నందిని : పిచ్చి భిక్షూ – నువ్వు నా గోడవు. నీ దగ్గరకు వచ్చినప్పుడల్లా నాకు ఎంతో ఎత్తు ఎక్కినట్లుంటుంది.

ఇక్కడేదో స్వచ్ఛమైన వెలుగురేఖ మెరిసిపోతున్నట్లుంటుంది.

భిక్షు : వెలుగు రేఖా....యీ యక్షనగరంలో వచ్చిననాటి నుంచీ ఆకాశాన్ని చూడడానికి వెలుతురును చూడడానికి కరువాచిపోయాను. అందరితో పాటు నన్నూ కలిపి యీ కటికి రాళ్ళ రోడ్డు వేశారు. ఆ దుర్ముహూర్తంలో నువ్వు నా దగ్గరకు వచ్చావు. నా కనులలో నీ కనులు నిలపి సూటిగా చూశావు. నాలో ఇంకా వెలుగు వున్నదన్న ఆశను అంకురింపచేశాయి నీ చూపులు. నేను చేరుకోలేని దూరతీరాలనుంచి నా కోసం దుఃఖభాగుల బాధామయగాధలను తెచ్చి వినిపించావు నువ్వు.

నందిని : నేనా?....నేనటువంటి వార్తలేవీ తీసుకురాలేదే!

భిక్షు : రంజన్ దగ్గర నుంచి కూడా?

నందిని : లేదు భిక్షూ లేదు...కల్లోల తరంగిణిలో అల్లకల్లోమైపోతున్న నా నావను రంజను సురక్షితంగా దరిచేర్చుతాడు. అడవిగుఱ్ఱాల జూలు పట్టుకుని వారి మీద స్వారీచేస్తాడు. కోపంతో కనుబొమలు ముడివేసి గర్జించే పెద్దపులిని భ్రూమధ్యాన బాణాలు కొట్టి సంహరిస్తాడు. నాగినీ నదిలోకి దూకి దాని ప్రవాహాన్ని తన బాహువులతో చెల్లాచెదురు చేసినట్లు తన సంఘర్షణాయుతమైన తన జీవింలంతో నన్ను కల్లోల పరుస్తాడు. తన సర్వస్వాన్ని యీ పందెంలో పణంగా ఒడ్డడం వల్లనే రంజన్ నన్నంతగా ఆకర్షించాడు. అప్పుడు నువ్వూ మాతో వుండేవాడివి. అయినా దూరదూరంగా తిరుగుతుండేవాడివి కదూ. మావంటి జూదరులను వీడిపోవాలని నువ్వొకనాడు అకస్మాత్తుగా అనుకున్నావు. వెళ్ళిపోతూ ఎందుకో నా కళ్ళల్లోకి తిన్నగా చూశావు. ఆ చూపులోని భావాలేమిటో నాకిప్పటికీ అర్థంకాలేదు. ఆ తరువాత ఇంతవరకూ నీ సంగతే మాకు తెలియదు. ఇన్నాళ్ళు ఏం చేస్తున్నావు భిక్షూ?

భిక్షు : నా పడవ ఒడ్డుకుచేర్చి తాడుతో కట్టి వుంచాను. కాని తుఫాను గాలులు చెలరేగి త్రాడుతెంచి వేశాయి. నా పుట్టి ఎక్కడికో కొట్టుకుపోయింది.

నందిని : అంతులేకుండా పోయిన నిన్ను యీ యక్షనగరంలో బంగారపు గనులు త్రవ్వడానికి ఎవరు తీసుకొచ్చారు?

భిక్షు : ఒక స్త్రీ. స్వేచ్ఛగా విహరించే పక్షి శరాఘాతంలో నేలకూలినట్లు, ఆమె నన్ను యీ మానవుల మధ్యకు లాక్కువచ్చింది. అప్పుడు నేను నన్నెరుగని మత్తులో పడ్డాను.

నందిని : ఆమెకు నువ్వెలా అందావు?

భిక్షు : ఎక్కడా చుక్కనీరు కనిపించనప్పుడు దప్పిగొన్న హృదయం ఎండమావుల్ని చూసి భ్రమ పడదా? ఒకనాడు అస్తమిస్తున్న సూర్యుని వంక చూస్తూ కూర్చున్నాను. రాజప్రతినిధుల ప్రాసాదం మీది స్వర్ణ ధ్వజస్తంభాన్ని చూస్తున్నాది ఆమె. తదేక దృష్టితో ఇలా చూస్తూ ఉండే ఆ స్వర్ణధ్వజం వద్దకు తనను నడిపించగలవా అని ఆమె చూపులు నన్ను సవాలు చేశాయి. అర్థం లేని గర్వంల ఆ సవాలుకు అంగీకరించాను – ఆమెను ఇక్కడకు యీ కాంచన పతాకధ్వజం వద్దకు తెచ్చినప్పుడు

కాని యీ మాయ నాకు అర్థం కాలేదు.

నందిని : నిన్నిక్కడనుంచి తీసుకుపోవడానికి వచ్చాను భిక్షూ...

భిక్షు : మహారాజును సైతం చలింప చెయ్యగలిగిన నీ శక్తి అమోఘమైనదే నందినీ...నందినీ. అయితే నీకు ఆయన్ని చూసినప్పుడు భయంవెయ్యలేదా?

నందిని : ఆ వలకు ఈ వలనుండి చూచినంత కాలం భయంగానే వుండేది కాని ఆవలకు వెళ్ళి చూచాను గదా.

భిక్షు : ఎలా వున్నాడా మహారాజు?

నందిని : కావ్యాల్లో వర్ణించే నాయకునిలా వున్నాడు. గోపురముఖ ద్వారం వంటి ఆ పెద్ద నుదురు – నిర్భేద్యమైన ఇనుప తలుపులు గడియల వంటి ఆ చేతులు.

భిక్షు : లోపల నువ్వేం చూశావు?

నందిని : మహారాజు భుజం మీద ఒక డేగవుంది. ఆ పక్షిరెక్కలను దువ్వినట్లు మెల్లగా నా చేతిమీద నిమురుతూ.....నన్ను చూస్తే నీకు భయంగాలేదా? అని అడిగాడు. లేదన్నాను నేను. నా కేశపాశంలోకి తన వ్రేళ్ళను జొనిపి చాలాసేపు కళ్ళు మూసుకొని వుండిపోయాడాయ.

భిక్షు : అప్పుడు నీకేమనిపించింది?

నందిని : ఆ అనుభవం బావుంది నాకు. ఆయన వెయ్యి ఏళ్ళనుంచీ అక్కడే వుంటున్న వటవృక్షం లాగాను, నేను దానిమీద నివసించే చిన్నపక్షిలాగాను అనిపించింది. ఆయన ఒంటరి ఆత్మకు ఆ మాత్రం సంతోషం కలిగించినందుకు నాకెంతో ఆనందంగా వుంది.

భిక్షు : ఆయన ఏమన్నాడప్పుడు?

నందిని : ఆయన వాడిచూపులకు నా వేపుకు సారింది. నిన్నున గురించి తెలుసుకోవాలన్నాడు. నన్ను గురించి తెలుసుకోవడానికికేముంది నేనేమన్నా తాళపత్రగ్రంథాన్నా అన్నాను నేను. తాళ పత్రగ్రంథాల చాలా చదివాను. ఆ గ్రంథాల్లో వున్న సర్వస్వమూ నాకు తెలుసు నాకు తెలియందల్లా నీవే – అన్నాడు. అంతలోనే ఉద్విగ్నుడై రంజను గురించి అన్ని విషయాలు చెప్పు. నువ్వు అతన్ని ఎలా ప్రేమస్తున్నావో చెప్పు – అని బిగ్గరగా అరిచాడు. నేను చెప్పాను – అతని కోసం ఎలా ప్రేమిస్తున్నావో చెప్పు – అని బిగ్గరగా అరిచాడు. నేను చెప్పాను – అతని కోసం చనిపోవడానికి క్కూడా సంకోచించవా? అని అడిగాడాయా. ఏ క్షణానైనా అతని కోసం ప్రాణత్యాగం చెయ్యగలనని చెప్పాను. అలా వీల్లేదంటూ కోపంగా అరిచాడతను. ఒక్కసారి ఉవ్వెత్తుగా లేచి వెళ్ళు, వెళ్ళిపో యీ గదిలో నుంచి, నా పనిని చెడగొట్టకు అని అరిచాడు. నాకు అర్థంకాలేదు.

భిక్షు : ఎవరేం చెప్పినా ఆయనకు అర్థంకాకపోతే ఆయన కలాగే అగ్రహం వస్తుంది.

నందిని : భిక్షూ....పాపం మహారాజంటే నీకు జాలిగా లేదూ?

భిక్షు : అతన్ని దయదలచాలని భగవంతుడు కూడా అనుకుంటే ఒక్క నిముషం బ్రతుకుడాయన...

నందిని : అలా అనకు భిక్షూ...జీవించాలంటే ఆకాంక్ష ఆయనకు ఎంతగా వుందో తెలుసా?

భిక్షు : ఆయన జీవించి వుండడం అంటే అర్థం ఏమిటో, యీ రోజు చూస్తావుగా. ఆ దృశ్యాన్ని భరించగలవో లేదో?

నందిని : అదుగో, ఆ నీడ చూడు...రాజప్రతినిధి మన మాటలు వినడం లేదు కదా?

భిక్షు : యీ దేశమంతా రాజప్రతినిధి నీడలు వారి అంధకారమైపోయింది. ఆ ఆయన్ని గురించి నీ అభిప్రాయ మేమిటి?

నందిని : అంత నిర్జీవమైన ప్రతిమను నేనెక్కడా చూడలేదు. అప్పుడే వెదురు పొదలోనుంచి నరికిన వాసంలా ఆకులు వేళ్ళు నరాల్లో జీవం – ఏమీ లేని మనిషి.

భిక్షు : జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాడేమో – ఇతరుల్ని కూడా అలానే చేయాలని అతని ఆశ.

నందిని : ష్....మెల్లగా.....ఆయన వినగలడు.

భిక్షు : మనం నిశ్శబ్దంగా ఉన్నప్పుడే ఆయన ఇంకా బాగా వినగలడు. అది మరీ ప్రమాదం. ఆ పని వారితో వున్నప్పుడు చాలా జాగ్రత్తగా కొంచెంగా మాట్లాడతాను నేను. అక్కడవారిలో ఎక్కువ దుఃఖం అనుభవిస్తున్నవాడిని నేనే పని సంతుష్టుడౌతాడు రాజప్రతినిధి. కాని నీ సమక్షంలో అంత జాగ్రత్తగా వుండడం నాకు ఇష్టం నందినీ.

నందిని : అలా ఆపదలు కొనితెచ్చుకోకూడదు భిక్షూ.....అదుగో, రాజప్రతినిధి వస్తున్నాడు.

రా.ప్రతి : (ప్రవేశించి) ఏం 99? అంతరాలు లేకుండా అందరితోనూ స్నేహం చేస్తున్నట్లున్నావు?

భిక్షు : అంతస్థులు అంతరాలు అడ్డు నిలిచాయి గాని లేకుంటే మీతో కూడా స్నేహం మొదలు పెట్టేవాడిని.

రా.ప్రతి : సరే సరే....ఏమిటి దీర్ఘంగా చర్చించుకుంటున్నారల్లే వుంది!

భిక్షు : యీ మీ కారాగారంలోంచి ఎలా తప్పించుకోవాలా అని ఆలోచిస్తున్నాం.

రా. ప్రతి : ఆ విషయం నాతోనే చెబుతున్నావా? ఎంత సాహసం?

భిక్షు : పంజరంలో చిలుక పంజరం తలుపుల్ని సరదాకోసం ముక్కుతో పొడుస్తుందా? ఆ విషయం బయట చెబితేనేం? చెప్పకపోతేనేం?

రా. ప్రతి : పంజరంలో వున్నవాళ్ళు స్వేచ్ఛకోసం ప్రయత్నించడం మాకు తెలుసు. కాని, దానిని ఇంత బహిరంగంగా నిర్భయంగా చెప్పగా వినడం ఇదే మొదటిసారి.

నందిని : మీరు రంజనుని ఇక్కడకు రానివ్వరా?

రా. ప్రతి : ఇవ్వాళ అతనిక్కడికి వస్తాడు.

నందిని : యీ విషయం నాకిదివరకే తెలుసు. కాని ఇంత మంచివార్తను అందించినందుకు మీకు మేలు చేకూరాలని కోరుతున్నాను. అందుకు గుర్తుగా యీ కుందమాలను స్వీకరించండి.

రా. ప్రతి : యీ కుందమాలను రంజన్ కోసమే దాచరాదు?

నందిని : రంజనుకు ప్రత్యేకంగా వేరే మాల అల్లేను

రా. ప్రతి : అలా అనే అనుకున్నాను. బహుశా నీవు గళాభరణంగా అలంకరించనిదే కావచ్చునేమో కాని. నా మేలుకోరి ఇచ్చిన యీ కుందకుసుమాల మాల కేవలం వట్టిచేతులు సమర్పించిన బహుమానం. ఎదురుతెన్నులు చూస్తూ మనసునిలిపి రంజనుని ఆహ్వానించడానికి హృదయపూర్వకంగా కట్టినది ఎఱ్ఱగన్నేరు పూమాల. ఈ కుందమాలను వెంటనే మేము స్వీకరించకపోతే వాడిపోతుంది.

మనస్పూర్తిగా ఇచ్చే బహుమతి ఎంత ఆలస్యంగా అందుకుంటే అంత విలువ హెచ్చుతుంది. వస్తాను.

## (విరామం)

నందిని : (వల వెనకనుంచి) ఎందుకింకా నీకా అర్థంలేని కోరిక. నిరర్థకం....ఎవరా మనిషి నీ ప్రక్కన?

భిక్షు : నేను......రంజన్ బొమ్మ......నేను బొరుసు.

మగగొంతు: అయితే అయితే నీకు నందినితో అవసరమేమిటి?

భిక్షు : మోహన మురళికి సంగీతంతో ఏమవసరం?

మగగొంతు: నందినీ.....ఇతడు నీకేమవుతాడు?

నందిని : రాగాలాపనలో నా భాగస్వామి. అతని గొంతులో నా హృదయం నినదిస్తుంది. అతని రాగాలాపనలో నా బాధ ప్రతిశ్రుతులీనుతుంది. అలా అని అతను అంటూంటాడు.

మగగొంతు: యీ క్షణాల మీ జంటను దూరంచేస్తే ఏం చేస్తావు?

నందిని : అంత ఆగ్రహమా మహారాజా? మీకు తోడెవ్వరూ లేరా?

మగగొంతు: మధ్యాహ్న మార్తాండునకు స్నేహితులెవరు?

నందిని : నేనివాళ రంజనును కలుసుకుంటాను మహారాజా...

మగగొంతు: మీ జంటకలిస్తే చూడాలని వుంది.

నందిని : మీరా వల వెనక ఉంటే మేము కనిపించము.

మగగొంతు: అప్పుడు మిమ్మల్ని లోనికి రానిస్తాను.

నందిని : ఎందుకూ?

మగగొంతు: ఊరికే....కేవలం మిమ్మల్ని చూడాలని.

నందిని : మీకు మమ్ముల్ని చూడాలని వున్నదంటే నాకు భయంగా వుంది.

మగగొంతు: ఏం?

నందిని : అనుభవించడమే మీవంతు తప్ప అర్థం చేసుకునే సహనం మీకు లేదనిపిస్తుంది.

మగగొంతు: సరే, ఇక వెళ్ళు. నా కాలం వ్యర్థం చేయకు. ఆగు. ఒక్క నిముషం ఆగు. ఆ ఎఱ్ఱగన్నేరు ఇటుతే.

నందిని : మీకెందుకు?

మగగొంతు: ఆ మాలను చూస్తుంటే నా దురదృష్టం యీ రూపంలో వచ్చిందనిపించుతోంది. ఆ మాలను తెంచి పారవెయ్యాలనిపిస్తుంది. ఒకప్పుడు నందినే స్వహస్తాలతో యీ మాలను నా మెడలో అలంకరిస్తేనా – అప్పుడు.

నందిని : ఊ అప్పుడు?

మగగొంతు: ప్రశాంతంగా మరణించగల ననుకుంటాను?

నందిని : ఎఱ్ఱగన్నేరు అంటే ఇష్టమయిన ఎవరో నన్నాపేరుతో పిలిచారు. అతని కోసం దీన్ని ధరించాను.

మగగొంతు: అయితే ఆ మాట అతని దురదృష్టాన్ని కూడా సూచిస్తున్నదన్నమాట.

నందిని : అలా అనకండి. మీకు పుణ్యముంటుంది. ఇక నేను వెడతాను.

మగగొంతు: ఎక్కడికి?

నందిని : రంజను వచ్చేసరికి నేను మీ కోటగుమ్మం దగ్గర వేచి వుండాలి.

మగగొంతు: నిర్దాక్షిణ్యంగా రంజనుని పాతాళానికి త్రొక్కివేయాలని నా ఆకాంక్ష.

నందిని : నన్ను భయపెడుతున్నారా? ఎందుకీ నటన?

మగగొంతు: నటనా? నటనేనా? నేను నిజంగా భయంకరంగా లేనా?

నందిని : మిమ్మల్ని చూచి ఇతరులు భయపడడంలోనే మీ కానంద ముందనుకుంటాను. మా వూళ్లో వున్న శ్రీకాంత్ కూడా అంతే. వీధినాటకాల్లో రాక్షసుడి వేషం వేసినప్పుడు తనను చూచి పిల్లల దడుచుకుంటే అతనికి మహాసరదాగా వుండేది. ఇక్కడి ప్రజలు ఇతరుల్ని భయభ్రాంతుల్ని చేసే వ్యాపారం సాగిస్తున్నారని పిస్తుంది. అందుకే మిమ్మల్ని ఈ వల మాటలు దాచి, మీకు విచిత్రమైన ఆహార్యాన్ని అంటగట్టారు. అలా ఉండడం మీకు సిగ్గుగా లేదూ?

మగగొంతు: ఎంత తెగించి మాట్లాడుతున్నావు?

నందిని : మీరు భయపెట్టే యీ జనమంతా ఒకనాడు మిమ్మల్ని చూచి భయపడడానికి సిగ్గుపడతారు. మా రంజనే కనుక ఇక్కడ వున్నట్లయితే ప్రాణాల్నిసైతం లెక్కించకుండా మీ నిజ స్వరూపాన్ని బయటపెట్టేవాడు.

మగగొంతు: నీ నిర్లక్ష్యం మెచ్చుకోతగ్గది. ఇంతవరకూ నా జీవితంలో నేను నాశనం చేసిన వారందరి కన్నా మిన్నగా నిన్ను నిలబెట్టాలని వున్నది. ఆ తరువాత.

నందిని : ఆ! ఆ తరువాత?

మగగొంతు: ఆ తరువాత – రసంతీయడానికి ద్రాక్షగుత్తిని పిండినట్లు నిన్ను నా రెండు చేతులతోను గట్టిగా పట్టుకోగలిగితే – ఆ తరువాత వద్దు...వెళ్ళు....వెంటనే వెళ్ళిపో.

నందిని : మీరలా గట్టిగా అరిస్తే ఇక్కడే వుండిపోతాను. మీరేం చేసినా సరే.

మగగొంతు: నేనెంత కఠికివాడినో నీకు చూపించాలి. నా గదిలోంచి వినిపించే మూలుగులూ ఆర్తనాదాలూ నువ్వెప్పుడూ వినలేదా?

నందిని : విన్నాను. వాళ్ళందరూ ఎవరు?

మగగొంతు: గహనమైన జీవన రహస్యం. నేను వేరుచేసిన బంధాల కోసం సాగించే ఆక్రందన. ఒక చెట్టు నుంచి నిప్పుపుట్టాలంటే దాన్ని తగులబెట్టాలి. నీలో కూడా అగ్ని వుంది. రక్తవర్ణం కలిగి అగ్ని. నిన్నూ ఎప్పుడో దగ్ధం చేసి ఆ నిప్పును గ్రహించాలి.

నందిని : ఎంతటి కటికితనం?

మగగొంతు: సంధానించడం విచ్ఛిన్నం చేయడం – యీ రెండే నాకు తెలుసు. నేను పొందలేని దానికోసం జాలిపడను. విచ్ఛిన్నం చేయడమే ఒక విధంగా దాన్ని పొందగలిగిన మార్గం.

నందిని : సరే మొన్ననే ఒక పాట నేర్చుకున్నాను. పాడనా....

(నందిని పాట నెం. 3. అనుబంధం)

మగగొంతు: వద్దు వద్దు...ఆ పాట పాడకు.

నందిని : (పాడుతూనే వుంటుంది. నందిని పాట నెం. 3 రెండో చరణం) హూ! చాటుకు వెళ్ళిపోయాడు. మహారాజుకు పాటలంటే ఎంత భయం?

భిక్షు : పాటవింటే ఆయన హృదయం క్రుంగిపోతుంది. అందుకే అంత భయం. అయితే నందినీ, నీలాకాశంలో దూరంగా కానవచ్చే కాంతిరేఖలాగా నీ ముఖం మీద ఆ కొత్తకాంతి ఏమిటి?

నందిని : ఇవాళ రంజన్ వస్తున్నాడు కదూ.

భిక్షు : నీకెలా తెలుసు?

నందిని : నా కిటికీ ప్రక్కన వున్న మావిడిచెట్టుమీదికి రోజూ రెండు నీలకంఠ పక్షులు వస్తాయి. ప్రతిరోజూ రాత్రి పడుకోబోయేముందు ఆ ధృవతారకు నమస్కరించి, ఆ పక్షులజంట ఆనందంతో రెక్క విదిర్చినప్పుడు ఒక్క యీక నా గదిలోకి వచ్చిపడితే రంజన్ వస్తాడని నేననుకుంటూ వుండేదానిని. ఇన్నాళ్ళుగా నేననుకుంటున్న శుభం పండింది. ఈ నీలకంఠ పక్షి రెక్క నా రంజనుని విజయకిరీటం మీద అలంకరించాలని భద్రంగా దాచి వుంచాను.

భిక్షు : నీలకంఠ విహంగాలు మేలుపాట పాడతాయంటారు.

నందిని : ఔను భిక్షూ! నా హృదయం రంజనుని విజయ పథం.

భక్షు : మంచిది నందినీ.....నాకు పనివుంది. వెళ్ళాలి. పదపోదాం..(విరామం)

(రాజప్రతినిధి ఒక గ్రామ నాయకుడు వస్తారు)

రా. ప్రతి : రంజన్ ఏ విధంగానూ ఇక్కడికి రాలేదు – తెలుసా మేస్త్రీ.

మేస్త్రీ : అతన్ని వజ్రాగృహంలో సొరంగాలు త్రవ్వడానికి నియమించాను ప్రభూ.

రా. ప్రతి : ఆ అయితే?

మేస్త్రీ : తనకు పనిచెయ్యడం అలవాటు లేదన్నాడు. వజ్ర గృహ నాయకుడు పోలీసు బలగంతో వెళ్ళి అతన్ని బెదిరించాడు. కాని అతనికి భయమంటే ఏమిటో తెలిసినట్లు లేదు. భయపెడితే బిగ్గరగా నవ్వుతాడు. ఎందుకు నవ్వుతున్నావని అడిగితే గాంభీర్యం మూర్ఖతకు లక్షణమనీ, తాను దాన్ని దొలగించడానికి వచ్చానని అంటాడు.

రా. ప్రతి : మిగిలిన పనివాళ్ళందరితో పాటు కలిసి అతనిచేత కూడా పనిచేయించావా?

మేస్త్రీ : చేయించాను ప్రభూ. అలాంటి ఒత్తిడి కన్నా అతడు లొంగుతాడేమోనని భ్రమించాను. కాని ఆ లొంగుబాటు మిగిలిన పనివాళ్ళ నుంచి కూడా తొలిగిపోతుంది. ఇతన్నిచూసి వాళ్ళు కూడా ఎదిరించి సమాధానం చెప్పడం నేర్చుకుంటున్నారు. వాళ్ళందర్నీ హుషారు చేసి నాట్యం చెయ్యమన్నాను.

రా. ప్రతి : నాట్యమా?

మేస్త్రీ : రంజను పాడడం మొదలుపెట్టాడు. వాళ్ళకేం తాళాలా మేళాలా? వాళ్ళు పనిచేసే పలుగుపారలే మేళతాళాలుగా వాయించడం మొదలుపెట్టారు. ఇదేనా పనిచేయడం అని నాయకుడు అడిగితే – పనిచెయ్యడం కట్టిపెట్టాం మనుషులు తమ శక్తితో చెమటోడ్చి ఇహ ముందీ పనులు చెయ్యరు– ఆడుతూ పాడుతూ పనిచేస్తారు – అన్నాడు రంజన్.

రా. ప్రతి : ఒకవేళ అతనిగ్గాని పిచ్చెక్కలేదు కదా?

మేస్త్రీ : పిచ్చివాడేనండి. పారనిండా మట్టితవ్వవేమని అడిగితే ఇంతకంటే నాకో సితారివ్వకూడదు అని నవ్వుతాడు.

రా. ప్రతి : ఇంతకూ వజ్రగృహం నుంచి తప్పించుకుని అతనెలా రాగలిగాడు.

మేస్త్రీ : ఆ విషయం నాకేం తెలుసు ప్రభూ.....అతన్నెవరూ బంధించలేరని నా ఉద్దేశ్యం. అతని సాహసం అంటువ్యాధిలా పనివాళ్ళందరికీ పట్టుకుంది. (దూరంగా సితారు)

రా. ప్రతి : అటు చూడు మేస్త్రీ.....ఆ పాతసితారు వాయించుకుంటూ పోతున్నది రంజనే కదూ? కాస్త గుట్టూ మట్టూ కూడా లేకుండా ఎంత తెగించి పోతున్నాడో.

మేస్త్రీ : ఆ గోడలు ఎలా ఛేదించుకొచ్చాడో ఆ భగవంతుడికే తెలియాలి.

రా. ప్రతి : వెంటనే వెళ్ళి అతన్ని బంధించు. ఏమైనాసరే అతను యీ యక్షనగరంలో నందినిని కలుసుకోడానికి వీల్లేదు. ఊ..వెళ్ళి బంధించు.

నందిని : (ఆతృతతో వచ్చి) ఏమిటిది? వాళ్లంతా ఎవరు?

రా. ప్రతి : ఓ నువ్వా నందినీ.....నువ్వు ఇచ్చిన కుందమాలను ఈ సాయంకాలం ధరిస్తాను.

నందిని : చూడండి. ఎంత హృదయవిదారకమైన దృశ్యమో. రాజప్రాసాదానికి వెనుకవైపు నుంచి ఆ రక్షక్షభటులతో నడిచిపోతున్న ఆ జనమంతా ఎవరు?

రా. ప్రతి : రాజప్రాసాదం నుంచి నిష్క్రమించే మనుషులంటాము వాళ్లని!

నందిని : అంటే?

రా. ప్రతి : ఇవ్వాల్టికి పోనీ....ఆ విషయమంతా నీకూ ఒకనాటికి తెలుస్తుంది.

నందిని : కాని వాళ్ళు మనుషులేనా? వారిలో చీమూ నెత్తురూ వున్నాయా?

రా. ప్రతి : లేకపోవచ్చు.

నందిని : ఇప్పుడేనా....ఎప్పుడూ లేవా?

రా. ప్రతి : ఒకప్పుడుండి వుండొచ్చు!

నందిని : ఇప్పుడేమయ్యాయి?

రా. ప్రతి : అదుగో ఆచార్యులవారు వస్తున్నారు. వారి నడుగు. ఆచార్యా ఆ మనుష్యుల్లో ఉండే చీమునెత్తురుల సంగతి నందినికి కాస్త వివరించి చెప్పండి. నేను వెళ్ళిపోవాలి.

నందిని : అయ్యయ్యో అటు చూడండి. వాళ్ళంతా మనుషులు కారు. కేవలం నీడలు. ఆ నీడల్లో నేనెరిగిన ముఖాలు కనిపిస్తున్నాయి. ఎవరది? అనూప్ కాదూ? అతను? ఉపమన్య....ఆచార్యా! వాళ్ళిద్దరూ

అన్నదమ్ములు. ఎంతో దృఢకాయులు. శరద్రాత్రులు వెన్నెల విహారాల్లో మా నదిలో పడవల పోటీలో పాల్గొనేవారు. మత్తగజాల్లాంటివారు పనికిమాలిన శవాల్లా తయారయ్యారు. అదుగో శుక్లా.....కత్తియుద్ధంలో సాటిలేని వీరుడు....అనూప్. శుక్లా....ఇటు, ఇటు చూడండి. నేనూ నందినిని. మీ ఊరుప్రక్క ఊరు ఇషానీ మా ఊరు. అయ్యో, వారికి తలెత్తి చూచే ఓపిక కూడా లేదే.....ఇంక జీవితాంతం వాళ్ళు తలవంచే తిరగాలి కాబోలు. ఎవరది? కంకూ కాదూ? అబ్బా....ఆ పసికందుని కూడా చెఱుకు పిప్పిలా నమిలిపారేశారే....బాణాలకు వెదురుబద్దలు నరకాలన మిషతో ఏటి ఒడ్డుకు వచ్చేవాడు. నేనక్కడ నీరు పట్టుకోవడానికి వెడితే అక్కడ కూర్చుని ఉండేవాడు. ఎలా ఉడికించేదాన్ని. కంకూ....ఇటు చూడవూ.....నేను కనిపిస్తే చాలు అతని రక్తం పరవళ్ళు తొక్కేది. అటువంటివాడు ఇప్పుడు పిలిచినా పలకడం లేదు. పోయాయి.....అన్నీ పోయాయి. మా పల్లెలోని దీపాలన్నీ ఆరిపోయాయి. ఉక్కు మనుష్యులలోకి ఉక్కంతా హరించుకుపోయి తుప్పు మాత్రం మిగిలింది. ఇదంతా ఎలాజరిగింది ఆచార్యా.....వాళ్ళనిలా చేసిందెవరు?

ఆచార్య : నందినీ, మిగిలిన ఆ అస్థిపంజరాల్ని చూడకు. ఆ అగ్ని శిఖను చూడు. వెలికిచాటిన దాని వేయానాలుకలు ఎఱ్ఱదనాన్ని చూడు.

నందిని : నాకేమీ అర్థం కావడం లేదు.

ఆచార్య : మా మహారాజును చూచావు కదూ....వారిని చూచి నువ్వు ముగ్ధురాలువైనావు కదూ.

నందిని : అవును...ఆయన శక్తి అత్యద్భుతం.

ఆచార్య : ఆయన శక్తి....ఆ అద్భుత మంతా బొమ్మనుకో.....యీ దృశ్యమంతా బొరుసు. యీ అగ్నిజ్వాల నుంచి పెద్దవారు వెలికి రావడానికి చిన్నవారు అర్పణ చేయబడ్డారు. ప్రపంచంలో గొప్పతనం సంపాదించడానికి ఇదే మూలసూత్రం.

నందిని : ఇది దమనసూత్రం.

ఆచార్య : సూత్రాలను గురించి బాధపడి ప్రయోజనం లేదు నందిని. ఇంతకూ విధిని వ్యతిరేకించడం ప్రకృతి శక్తినే ఎదిరించడం వంటిది.

నందిని : ఇదే మానవుడి జీవన పద్ధతి అయితే నాకు అస్తిక్యమే అక్కరలేదు. ఆ నీడల వెంట నేనూ నిష్క్రమిస్తాను. దారి చూపించండి ఆచార్యా!

ఆచార్య : ఆ రోజు రావాలిగాని ఆ ప్రకృతిశక్తే దారి చూపుతుంది. అంతవరకూ మార్గం దొరకదు. నందినీ నీ ఉద్వేగం స్ఫుటంగా కన్పిస్తోంది. యణారుణమైన నీ వదనం మీదికి జారిన ఆ ఎఱ్ఱగన్నేరు మాలలు గాఢనిశీథిలో విజృంభించే తుఫాను మబ్బులాగుంది.

నందిని : (ఎలుగెత్తి) మహారాజా మహారాజా....

ఆచార్య : అంతఃపుర కవాటం మూసివేశారు. నీ పిలుపు ఆయనకు వినిపించదు....నందినీ....

నందిని : భిక్షూ.......భిక్షూ....

ఆచార్య : అతనెందుకు?

నందిని : అతడింకా తిరిగిరాలేదు. నాకు భయంగా ఉంది.

అచార్య : ఇంతవరకూ నీతోనే వున్నాడుగా.

నందిని : రంజనుని చూడాలని రాజప్రతినిధి అతడిని పిలిపించాడు. నేనూ వెళ్ళాలనుకున్నాను అతనితో. కాని, వాళ్ళు నన్ను అడ్డగించారు. అరుగో రాజప్రతినిధి అయ్యవారితో గూడా వస్తున్నారు. ప్రభూ, నా భిక్షూకు ఎక్కడకు తీసుకువెళ్ళారో చెప్పివెళ్ళండి ప్రభూ!

రా. ప్రతి : అతన్ని తీసుకుపోవడానికి నేనెవర్ని? మేఘాల్ని పవనాలు తీసుకుపోతాయి. అదే నీకు నేరంగా తోస్తే ఆ పవనాల చేత ఆ పని ఎవరు చేయిస్తున్నారో తెలుసుకో.

నందిని : యీ దేశంలో భయంకరంగా వుంది. మీరూ, మీరు నడిపే యీ మనుషులూ మనుషులు కారు. మీరు చండప్రచండంగా వీచే గాలివంటివారు. ఆ మనుషులు మేఘాలు. అయ్యవారు నా భిక్షూ ఎక్కడవున్నాడో మీకు తెలుసు. చెప్పండి స్వామీ.

అయ్య : అతనెక్కడున్నా మంచిదేనమ్మా!

నందిని : ఎవరికి మంచిది.

అయ్య : ఆ విషయం నీకు అర్థంకాదమ్మా! ఓ వదులు ఒదులు...నా రుద్రాక్షమాల పట్టుకు లాగుతావేం? ఒదులు....ప్రభూ ఎవరీ అమ్మాయి?

రా. ప్రతి : మన దేశంలోని నియమాలు ఆమెకు వర్తించవు అయ్యవారు, స్వయంగా మహారాజే.

అయ్య : ఎంత కోపం. ఇక నా పరువు మర్యాదలుండవు. నేను పారపోతాను.

నందిని : ప్రభూ....ఆగండి...భిక్షూను మీరెక్కడికి పంపించింది చెప్పిమరీ వెళ్ళండి. తప్పదు.

రా. ప్రతి : విచారణకు న్యాయస్థానానికి పంపేరు నీ భిక్షూని. అంతకంటె ఎక్కువగా నేను చెప్పను. నన్ను వెళ్ళనీ.

నందిని : ఆగండి.....అతనేం నేరం చేశాడు?

రా. ప్రతి : ఒక్క మాట చెప్పనా నందినీ! నీ భిక్షూకి వచ్చిన ఆపదలన్నింటికీ నువ్వే కారణం. తెలిసిందా?

నందిని : నేనా?

రా. ప్రతి : ఔను....అక్షరాలా నువ్వే! ఇక్కడున్న ప్రతిమనిషిలా అతను కూడా తాను చేస్తున్న పనికి పూర్వం సంతృప్తి చెందాడు. ఎదిరించడం అతనికి నువ్వే నేర్పావు!

నందిని : ఆగండి.....యీ విషయం కూడా చెప్పి వెళ్ళండి. నన్ను చూడడానికి రంజనుని కూడా ఇక్కడికి రానివ్వరా?

రా. ప్రతి : ఊహూ.....వీల్లేదు!

నందిని : వీల్లేదా? చూస్తాను. ఏదీ ఏమయినా నేను రంజనుని యీనాడు కలుసుకుంటాను. కలుసుకు తీరతాను. తప్పదు. ఇంక మీరు వెళ్ళొచ్చు. వెళ్ళిపొండి....(వలను తట్టిన చప్పుడు) విన్నారా మహారాజా! ఇదేనా మీ న్యాయం? మీ న్యాయస్థానం ఎక్కడ? నన్నూ రానివ్వండి. మహారాజా!

కిశోర్ నువ్వా.....భిక్షూ కనిపించాడా కిశోర్?

కిశోర్ : నాకు తెలుసు నందినీ....ఇప్పుడే నువ్వా అతన్ని చూస్తావు. ప్రధాన రక్షణాధికారికి అకస్మాత్తుగా నేనంటే అనురాగం ఏర్పడింది. భిక్షూను నువ్వున్న ఈ తోవనే నీకు కనిపించేలా తీసుకువెళ్ళండని ఆయన్ని ప్రార్థించాను. అంగీకరించాను.

నందిని : రక్షణాధికారా? తీసుకుపోతున్నారా? అంటే......

కిశో : ఔను.....అరుగో....వాళ్ళు వస్తున్నారు.

నందిని : భిక్షూ....అయ్యో. ఏమిటిది భిక్షూ? నీచేతికి సంకెళ్ళా? ఏం చేశావని? నిన్నెక్కడికి తీసుకు వెడుతున్నారు భిక్షూ?

భిక్షూ : నందినీ భయపడకు! అయ్యా, ఆమెతో రెండు మాటలు మాట్లాడడానికి అనుమతిస్తారా? నందినీ, ఇన్నాళ్ళకు నాకు స్వేచ్ఛ లభించింది.

నందిని : అర్థం కావడం లేదు. సరిగ్గా చెప్పు.

భిక్షూ : వస్తున్న ప్రమాదాల నుంచే తప్పించుపోవడమే స్వేచ్ఛనుకునే వాడివి. అదే అన్నిటికంటే హేయమైన బానిసత్వం.

నందిని : నువ్వేం తప్పుచేశావని తీసుకుపోతున్నారు.

భిక్షు : ఇన్నాళ్ళకు నిజం చెపుతున్నాను. నిజం చెప్పే అవకాశం నాకు దొరికింది. నా స్వేచ్ఛా స్వాతంత్రాలకు యీ సంకెళ్ళు నిదర్శనాలు.

నందిని : నిన్నింత క్రూరంగా బంధించి రెక్కలు విరిచికట్టి దారివెంట నడిపించుకుపోవడానికి వాళ్ళేం మనుషులు కారా?

భిక్షు : వారి లోలోపల పశుత్వం ఉంది. అందుకనే మానవులకు జరిగే అవమానాలను వారు తలలెత్తి చూడగలుగుతున్నారు. వారి శిరస్సులు సిగ్గుతో కుచించుకుపోవడం లేదు!

నందిని : నన్ను కూడా ఇలా బంధించి నీతోపాటు తీసుకుపోనీ. నీ బాధలో నన్ను కూడా కొంత పాలు పంచుకోనీ....లేకుంటేనేను పచ్చిగంగ కూడా ముట్టను.

కిశోర్ : నువ్వుండిపో భిక్షూ.....నీ బదులు నే వెడతాను.

భిక్షు : వద్దు కిశోర్.

కిశోర్ : నేనింకా కుర్రవాణ్ణి. వాళ్ళు విధించే శిక్షలను సంతోషంగా అనుభవించగలుగుతాను.

నందిని : వద్దు వద్దు....అలా మట్లాడకు కిశోర్.

భిక్షు : ఇంతకన్నా ప్రమాదకమైన పనికి నిర్వాహకుడివిగా వుండాలి నువ్వు కిశోర్. రంజన్ వచ్చాడు. అతని ఆచూకి కనుక్కోవాలి.

కిశోర్ : ఇప్పుడే వెడతాను. అతడు కనిపిస్తే ఏం చెప్పమంటావు....నందినీ?

నందిని : ఇదుగో....యీ ఎఱ్ఱగన్నేరు మాట అన్ని విషయాలు తేటతెల్లచేస్తుంది. ఇది అతని కివ్వు.

భిక్షూ : మళ్ళా మీరిద్దరూ కలుసుకోవాలి నందినీ.

నందిని : యీ కలయికలో నా కిప్పుడు ఆనందంలేదు. నిన్నిలా నిర్దాక్షిణ్యంగా పంపేస్తున్నానన్న సంగతి ఎన్నటికి మరిచిపోలేను. పాపం పసివాడు. కిశోర్‌కి మాత్రం నేనేమివ్వగలుగుతాను!

భిక్షు : అతనితో ఆరని జ్యోతి వెలిగించావు. చాలదా నందినీ...ఆ నీలకంఠ పక్షి యీకతో రంజనుని అలంకరిస్తానన్నావు గుర్తున్నదా నందినీ...అతను వస్తున్నాడు. మరిచిపోకు నందినీ. పదండి వెడదాం. వస్తాను నందినీ.

నందిని : భిక్షూ...భిక్షూ.....వెళ్ళిపోయవా భిక్షూ

(విరామం, రాజప్రతినిధి, డాక్టరు వస్తారు)

డాక్టరు : వాళ్ళని నేను పరీక్షించాను ప్రభూ. మహారాజుగారు ఎందుకనో తమలోతాము తీవ్రంగా బాధపడుతున్నారు. అది శారీరకమైన వ్యాధికాదు.

రా. ప్రతి : మహారాజులు మనోవ్యాధికి మందు ఏమిటి డాక్టర్.

డాక్టర్ : ఒక పెద్ద విఘాతం తగలాలి. మరో మహారాజుతోనో ప్రజలతోనో తీవ్రమైన సంఘర్షణ సంభవించేటట్లు చూడండి.

రా. ప్రతి : అంటే మరొకరికెవరికైనా హానీ కలిగించకపోతే మహారాజు తమకు తామే కీడుకొనితెచ్చుకుంటారంటారా?

డాక్టరు : యీ పెద్దలందరూ పసిపాపలు ప్రభూ....వాళ్ళకు ఎప్పుడూ ఏదో ఒక ఆటవుండాలి. ఒక ఆట అంటే విసుగు పుట్టినప్పుడు మరో ఆట.

రా. ప్రతి : సరే.....ఆ ఏర్పాట్లు సక్రమంగా చేయబడ్డాయి. మీరిక వెళ్ళిరావచ్చు. ఎవరక్కడ?

స. ప్రతి : నేను సహాయ ప్రతినిధిని. నర్తక బృందానికి వాద్యగాండ్రకు ఉద్యానవనానికి రావలసిందిగా వర్తమానం వెళ్ళింది ప్రభూ.

రా. ప్రతి : మరి.....రంజను విషయం.

స. ప్రతి : అది నా విధికాదు రాజప్రతినిధి. ఉప రాజప్రతినిధి ఆ కార్యాన్ని స్వయంగా నిర్వర్తిస్తున్నారు.

రా. ప్రతి : మహారాజుకు యీ విషయం.

స. ప్రతి : మహారాజులకీ విషయం అర్థమైనట్లు తోచదు. యీ వ్యవహారం నాకేమీ బాగులేదు. మహారాజుగారి నీ విధంగా మోసం చేయడం కూడా మంచిది కాదు.

రా. ప్రతి : ఆ భారం నాకు వదలండి. ఇంక మీరు వెళ్ళవచ్చు.

(దృశ్యం మార్పు విరామగీతం)

(నందిని, ఫాగులాల్, చంద్ర ప్రవేశిస్తారు)

ఫాగు : మా భిక్షూ ఇందాక నీతో వచ్చాడు. ఏడీ? నిజం చెప్పు?? అతన్నెక్కడ మాయం చేశావు?

నందిని : రక్షకభటులు అతన్ని బంధించి తీసుకువెళ్ళారు.

చంద్ర : ఓసి మాయదారిదానా.....అతనికి మీద వాళ్ళతో నువ్వేం చాడీలు చెప్పావో? నువ్వు వాళ్ళ గూఢచారివి కాదూ?

ఫాగు : యీ దేశంలో ప్రతి ఒక్కరూ ఎదుటివారిని అనుమానిస్తూనే వున్నారు. కాని ఇంతకాలం నాకు నీ మీద పూర్తి విశ్వాసం వుంది నందినీ. కాని ఇవ్వాళ మాత్రం అంతా అయోమయంగా వుంది.

నందిని : నువ్వు చెప్పిందే నిజం చంద్రా. నాతో వుండడం వల్లనే భిక్షూ చిక్కుల్లో పడ్డాడు. మీతో వున్నప్పుడు ఏ చికాకులూ లేక హాయిగా వున్నాడు.

చంద్ర : అయితే అతన్నిలా సర్వనాశనం చేశావెందుకు?

నందిని : భిక్షూ స్వేచ్ఛకోసం తహతహలాడతాడు. అందుకోసం.

చంద్ర : అహా, మహామంచి స్వేచ్ఛనే ఇచ్చావు. ఇదుగో నందినీ! భిక్షని తీసుకుని మాకొప్పకించకపోతే ఫలితం అనుభవిస్తావు. జాగ్రత్త.

ఫాగు : అనవసర ప్రసంగాలెందుకు? మనవాళ్ళ నందర్నీ కూడగట్టుకుని వెళ్ళి ఆ కారాగారం తలుపులు బ్రద్దలు కొడదాం. పదండి.

నందిని : పదండి. నేనూ వస్తాను.

చంద్ర : ఎక్కడికి?

నందిని : బ్రద్దలు కొట్టడంలో మీకు సహాయం చెయ్యడానికి!

చంద్ర : ఇంతవరకూ బ్రద్దలుకొట్టినవి చాలకనా తల్లి.

గోకుల్ : (ప్రవేశించి) యీ మాయలాడిని నిలువునా తగులబెట్టాలి.

చంద్ర : అది సరైన శిక్షకాదు గోకుల్....అందరి నాశనానికీ కారణభూతమైన యీ అందాన్ని ముందు మంటగలుపు!

గోకుల్ : అదెంత పని. ఇదుగో యీ సుత్తితో ఆ మొహం చెక్కేస్తే సరి.

ఫాగు : ఆగు గోకుల్ ఆగు.....నందినిని ఏమైనా చేశావా....

నందిని : ఊరుగో ఫాగులాల్....గోకుల్ వట్టి పిరికిపంద. నేనంటే అతనికి భయం కనుక నన్ను నాశనం చేయాలని సంకల్పించుకున్నారు. నేనిలాంటి వాటికి భయపడను.

గోకుల్ : ఫాగూ నీకింకా బుద్ధిరాలేదు. రాజ ప్రతినిధి అంటే నీకు విరోధమన్నావు. అతను ప్రత్యక్ష శత్రువు. కాని యీ అందాల రాక్షసి మాత్రం.....

ఫాగు : గోకుల్ మితిమీరి మాట్లాడుతున్నావు. ఎలాగైతేనేం ఇన్నాళ్ళకు ధైర్యసాహసాలు చూపిస్తున్నావులే. నీ ప్రతాపమంతా ఇలాంటి ఆడదానిమీద చూపకు. నువ్వు నీ సాహసాన్ని ధైర్యాన్ని వినియోగించ వలసిన తావు చూపుతాన. నాతోరా....

నందిని : అయ్యా.....మీరంతా ఎక్కడికి వెడుతున్నారు?

10 : పతాకోత్సవానికి!

నందిని : మీకెక్కడైనా రంజను కనిపించాడా?

90 : నాలుగైదు రోజుల క్రిందట కనిపించాడు.

నందిని : రంజనుని వాళ్ళెక్కడ దాచారో మీకు తెలుసా?

10 : ష్......మాట్లాడకు.

నందిని : మీకు తెలుసు....చెప్పండయ్యా!

90 : యీ చెవితో విన్న విషయాలు ఆ చెవితో వదిలెయ్యాలి మేము. మాకు తెలియదుగాని ఆయుధాలు మోసుకొస్తు ఇంకా వెనక కొందరొస్తున్నారు వాళ్ళనడుగు తల్లీ!

నందిని : ఒక్క క్షణం ఆగండి బాబూ. రంజను ఎక్కడున్నాడు?

30 : పతాకోత్సవానికి సమయం అట్టే లేదు. దానికి మహారాజు స్వయంగా వస్తున్నారు.

నందిని : (వలను తట్టుతూ) మహారాజా....యీ తెర తొలిగించండి.

మగగొంతు: నీకు మాత్రం తీయడానికి వీల్లేదు. వెళ్ళిపో.....

నందిని : మీరు నా మనవి ఆలకించాలి.

మగగొంతు: ఆ విషయం రంజన్‌ను గురించి – నాకు తెలుసు. అతని తక్షణం ప్రవేశపెట్టమని రాజప్రతినిధికి ఆదేశించాను. కాని, నేను పతాకోత్సవానికి వచ్చేసరికి నువ్వక్కడ నిలవకు. చాలా ప్రమాదం.

నందిని : నాకేం భయంలేదు. భయం పేరుతో నన్ను మభ్యపెట్టకండి. ఏమైనా సరే యీ ఇనుప తలుపులు తెరుచుకొనేవరకు నేనిక్కడే వుంటాను.

మగగొంతు: ఇవాళ పతాకోత్సవం. నా మనసు చెదరగొట్టకు. ఇక్కడనుండి వెళ్ళు.

నందిని : నిత్యమూ ఉండే భగవంతుడి పూజకు అంతతొందర అక్కరలేదు. బ్రతికిన నాలుగురోజుల్లోనే తన బాధనుంచి విముక్తుడు కావాలి మానవుడు.

మగగొంతు: నేనెంతో అలసిపోయాను. నన్నింకా నీరసపెట్టకు.

నందిని : మీరు నా మీదుగా నడిచివెళ్ళినా సరే నేను మాత్రం మిక్కడినుంచి కదలను.

మగగొంతు: ఇన్నాళ్లు నీకు చనవు ఇచ్చినందుకు ఫలితంగా నన్ను తిరస్కరించడం అలవాడు చేసుకున్నావు. యీ రోజుల్లో నీ గర్వాన్ని అణిచివేస్తాను. నా శక్తిని నీకు చూపించే సమయమాసన్నమైంది.

నందిని : సరే.....అలాగే చూపండి. మీ తలుపులు తెరువండి.

(తలుపులు తెరుచుకుంటాయి. మహారాజు వెలికి వస్తాడు)

నందిని : ఆ! ఎవరది? ఎవరు? రంజన్ కదూ....ఆ నేలమీద ఎవరు? రంజన్....

మగగొంతు: ఎవరు? రంజనా? నిజం?

నందిని : అవును. నిజంగా నా రంజనే.

మగగొంతు: అయితే అతని పేరు ఎందుకు దాచిపెట్టుకున్నాడు? నాతో అలా ఎందుకు సవాలు చేశాడు.

నందిని : లే రంజన్ లే.....నేను నీ ఎఱ్ఱగన్నేరును....మాట్లాడవేం రంజన్.....రంజన్..మహారాజా నా రంజన్ మాట్లాడడం లేదే?

మగగొంతు: మోసం......యీ దుర్మార్గులు నన్ను మోసం చేశారు. నా పరివారమే నన్ను మోసపుచ్చింది. పిలవండి. ఎవరక్కడ? రాజప్రతినిధిని వెంటనే రమ్మను. చేతులకు సంకెళ్ళు వేసి నా ఎదుటకీడ్చుకురండి.

నందిని : మహారాజా మీకు మంత్రతంత్రాలు తెలుసునంటారు. రంజన్‌ను లేపండి. నాకోసం!

మగగొంతు: నా మంత్రశక్తి జాగృతిలోని మానవులను నిదురమైకం కలిగించగలదే కాని మెలుకుల కలిగించగల శక్తి లేదు.

నందిని : అయితే నాకూ ఆ నిద్రమత్తుకలిగేనా చేయండి. నన్ను కూడా దీర్ఘనిద్రలోకి త్రోసి వేయండి.

మగగొంతు: ఇన్నాళ్ళుగా యువతను చేజేతులా నాశనం చేశాను నందినీ....ఇప్పుడా యువశక్తి అభిశాపం నన్ను వెంటాడుతోంది.

నందిని : కనీసం రంజన్ నా పేరైనా చెప్పలేదా?

మగగొంతు: చెప్పాడు నందినీ చెప్పాడు. నా నరనరాలూ, అణువణువూ భగ్గున మండిపోయేటంత బిగ్గరగా చెప్పాడు.

నందిని : ఎంత సాహసం చేశావు రంజన్. ఇదుగో యీ చిత్రగ్రీవ పక్షి యీకలో నిన్ను అలంకరిస్తున్నాను రంజన్. నేటినుంచి నీ విజయం మొదలు. దాన్ని దిగంతాలకు వ్యాప్తం చేస్తాను. అదుగో అతని చేతులలో నేనిచ్చిన పూలదండ. అయితే కిశోర్ అతన్ని కలుసుకుని వుండాలి! మహారాజా కిశోర్ ఏడీ? ఏడీ ఆ కుర్రవాడు?

మగగొంతు: ఎవరా కుర్రవాడు? అతడా? నన్నే నిందించాడు. నన్నెదిరించడానికి సాహసించాడు.

నందిని : మహారాజా...ఇప్పుడు నిజంగా రోజులు సమీపించాయి.

మగగొంతు: దేనికి?

నందిని : మన ఇరువురి అంతిమ పోరాటానికి!

మగగొంతు: నిన్నొక్క క్షణంలో రూపుమాపగలన తెలుసా?

నందిని : ఆ క్షణం నుంచి నా మరణం మిమ్మల్ని ప్రతిక్షణమూ పీడకలలా వెంటాడుతుంది.

మగగొంతు: నందినీ, యీనాటి నుంచి నన్ను నీ స్నేహితుణ్ణి చేసుకో – నాకు వ్యతిరేకంగా పోరాటం సలుపు. కాని నాతో జంటగా వుండు. ఆ పోరాటం అప్పుడే ప్రారంభమయింది. అదుగో అటు చూడు... రాజపతాకం ముందు ఆ ధ్వజాన్ని తరువాత ఆ స్తంభాన్ని నాశనం చేస్తాను. నన్ను నేను చంపుకోవడానికి నువ్వు కూడా నాకు సహాయం చేయి నందినీ....నా కదే ప్రాయశ్చిత్తం...

రక్షకభటు : (త్వరగా అడ్డుకుంటూ) ఆగండి మహారాజా ఆగండి. ఏమిటి మీ సాహసం. మా రాజరికానికి పవిత్ర చిహ్నమైన యీ ధ్వజాన్ని విరచడానికి ఎంత సాహసం. స్వర్గ మర్త్యాలకు సేతువు యీ ధ్వజం. ఎంత పాపం. అందులోనూ పతాకోత్సవ పర్వదినం నాడా? సోదరులారా! పదండి. యీ విషయం మన రాజప్రతినిధులకు వెంటనే విన్నవించుదాం. పదండి....(త్వరత్వరగా నిష్క్రమిస్తారు)

మగగొంతు: పతనం చేయవలసినవి ఇంకా వున్నై. నాతోనే వుంటావుగా నందినీ?

నందిని : ఉంటాను. పదండి.

నందిని : రక్షణ అన్నపేరుతో నన్ను ఏకాంతంగా వదిలివేస్తారా? (పిలుస్తూ) రాజప్రతినిధీ...ఇటు చూడు. ఆయన నేనిచ్చిన తెల్లని కుందకుసుమాలను ధరించాడు. నా హృదయ రక్తంతో దానికి నా ఎర్రగన్నేరు మాల వలె అరుణ రాగాన్ని హత్తుతాను. అదుగో రాజప్రతినిధి నన్ను చూచాడు. జోహార్...రంజన్ జోహార్. (పరుగెత్తుకు వెడుతుంది)

మగగొంతు: (ఆమె వెంట పరుగెడుతూ) నందినీ....నందినీ....

ఫాగు : ఆచార్య...ఎక్కడి కంత అంగల పంగల మీద పోతున్నారు?

ఆచార్య : బంధాలను తెంచుకుని జీవన రహస్యాన్ని తెలుసుకోవడానికి మహారాజు నిర్గమించారని విన్నాను. నా గ్రంథపఠనం విరమించి ఆయన్ను అనుసరించాలని వచ్చాను.

ఫాగు : మహారాజు మరణించడానికి వెళ్ళారు. నందిని పిలుపు ఆయనకు వినిపించింది.

ఆచార్య : అదేమిటి. ఆ ఉక్కువల అలా తుత్తునియలైపోయిందేం? నందిని ఏదీ?

ఫాగు : నందిని అందరికన్నా ముందు వెళ్ళిపోయింది. ఆమెను మన మందుకోలేం ఆచార్యా!

ఆచార్య : కాదు....ఆమెను అందుకోవాలి. వస్తానూ...

భిక్షు : (ప్రవేశించి) ఫాగులాల్ నందిని ఏదీ?

ఫాగు : నువ్విక్కడికెలా వచ్చావు భిక్షూ?

భిక్షు : మన పనివాళ్లు కారాగారాన్ని పగులగొట్టారు. పోరాటాన్ని కొనసాగించడానికి అరుగో పరుగెత్తుకు వస్తున్నారు. నందినిని చూడాలని నేను ముందుగా వచ్చాను. ఆమె ఏదీ?

ఫాగు : మన కన్న ముందుగా వెళ్ళింది నందిని!

భిక్షు : ఎక్కడికి?

ఫాగు : అంతిమ పోరాటం సాగించడానికి. భిక్షూ...అక్కడ వున్నది ఎవరో చూశావా?

భిక్షు : రంజన్.

ఫాగు : (చూశావా ఆ ఎర్రని గుర్తులు)

భిక్షు : అవును...నాకు తెలుసు. వారి పవిత్ర వివాహానికి గుర్తు ఆ అరురణరాగం.

ఫాగు : యీ అంతిమ నిశ్వాసంతో వారు ఏకంగా అయ్యారు.

భిక్షు : ఇక నేను మాత్రం మిగిలాను. ఇలా ఏకాంతంగా నా జీవన మార్గాన పయనించడానికి. మేమూ ఎప్పుడో కలుసుకోవచ్చు. అప్పుడు నన్నొక పాట పాడమనవచ్చును. ఆమె పిచ్చిపిల్ల. ఆ....పద తమ్ముడూ....మనమూ పోరుకు పోదాముజ

ఫాగు : ఔను....పద....నందినికి జయం కలాగాలి.

భిక్షు : నందినికి జయం కలగాలి.

ఫాగు : ఇదుగో ఆమె చేతులకు కట్టుకున్న ఎర్రగన్నేరు దండ....ఆ దండ ఆమెను వీడి నేలరాలింది. నందిని మనలను విడిచిపోయింది.

భిక్షు : ఒకనాడు ఆమెతో చెప్పాను. ఆమె చేతిమీదుగా నేనేమీ గ్రహించనని – కాని ఆ మాటను ఒక నిలబెట్టుకోలేను. యీ ఎఱ్ఱగన్నేరు దండను నేను తీసుకుంటాను. ఎఱ్ఱగన్నేరు....పద ఫాగులాల్.... వెడదాం...

(దూరంగా శిశిర గీతం వినిపిస్తూ వుంటుంది)

వినుమోహో అల్లదిగో వినుమోహో శిశిర లక్ష్మీ
రావోయీ రావోయీ రావోయీ అనుచు పిలుచు....విను....
పసిమిపైట మోవి చెఱగు నిండ బంగరు ధాన్యములు పండ
మిసిమి మోవి కదలకుండ మించునవ్వు పొలుపు నిండ....
మధు మలయానిలము గ్రోలి మత్తిల్లెన అకసమ్ము
ఒరగపండినట్టి చేల ఒడులెరుగక అట్టె తూలె.....

## ఎఱ్ఱ గన్నేరు పాటల అనుబంధం

**1వ పాట శిశిర గీతం**

వినుమోహో అల్లదిగో
వినుమోహో శిశిర లక్ష్మి
పసిమి పైట చెఱగు నిండ
బంగరు ధాన్యములు పండ
మిసిమి మోవి కదలకుండ
మించు నగవు పొలుపునిండ...... (వినుమోహో)

మధుమలయానిలము గ్రోలి
మత్తిల్లిన అకసమ్ము
ఒరగ పండినట్టి చేల
ఒడ లెరుగక అట్టె తూలె..... (వినుమోహో)

**2 వ పాట....పడవ పాట**

కలల బరువు పడవ నడుపు
కర్ణధారి వెవరివోయీ..... (కలల..)

హోరుగాలి వడికి పడవ
జోరుతాళ లేని నడక
కలల పడవ కలలు తాకి
గలగలగా కలగానం..... (కలల)

పడవ ఇసురు కోపలేను
ఎడద నుబుకు భావమోదో
మదకల గానాల రేపు
మదిని పిలుచు పిలు పేరిదొ.... (కలల)